
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 26.08.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# తు(స్వి)స్... ఛాలెంజ్

- రాజధాని అక్రమాలపై హైకోర్టు మొట్టికాయ
- ప్రభుత్వానికి తొలి ఎదురుదెబ్బ




***సింగపూర్ లాంటి రాజధాని... టోక్యో లాంటి రాజధాని... బీజింగ్ లాంటి రాజధాని... లండన్ లాంటి రాజధాని... చంద్రబాబు చివరికి ఎటువంటి రాజధాని కడతాడో అంతు బట్టడమే లేదు. అమరావతి రాజధాని నిర్మాణమే తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు, దానినో పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చేసుకున్నాడు. దేశంలోనే అత్యంత సారవంతమైన భూములున్న అమరావతి పరిసరాలలో 50వేల ఎకరాల మాగాణి భూములను నిలువునా నాశనం చేస్తూ తన హైటెక్ కలలను అక్కడ అమలు చేయాలనుకుంటున్నాడు. ఈ పరంపరలో రాజధాని కేంద్రంగా అనేక అక్రమాలకు తెరతీసినట్లయ్యింది. మొదట ఇక్కడ భూములను కోల్పోయిన రైతులు నిలువునా బ్రతుకును కోల్పోయినట్లే! వారికిస్తామన్న జాగాలు ఎప్పటికోగాని అమ్ముకోలేని పరిస్థితి.***

ఇక రాజదాని నిర్మాణం విషయంలో చంద్రబాబు మొదట్నుండి విదేశీ కంపెనీల వైపు అందులోనూ తనకు ఇష్టమైన సింగపూర్ కన్సార్డియం వైపే మొగ్గు చూపుతున్నారు. ఇందులో ఏం మతలబు ఉందన్నది దేవుడికే తెలియాలి.

ఓ పక్క నరేంద్ర మోడీ 'మేకిన్ ఇండియా', 'మేడిన్ ఇండియా' అంటూ స్థానిక ప్రతిభను ప్రోత్సహించే పనిలో వుంటే, చంద్రబాబు మాత్రం మనోళ్లకు రాజధానులు నిర్మించిన అనుభవం ఉందా? మన వాళ్లు కడితే అవి మురికివాడలవుతాయని భారతీయ ఇంజనీరింగ్ కంపెనీలను అవమానించాడు. ఈరోజు భారతదేశంలోనే కాదు, ఎన్నో దేశాలలో ప్రతిష్టాత్మకమైన నిర్మాణాలన్నీ కూడా భారతీయ ఇంజనీరింగ్ కంపెనీల సారధ్యంలోనే జరుగుతున్నాయన్న విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. కాకపోతే ఆయన మైండ్‌లో సింగపూర్‌ను ఫిక్సయ్యాడు. అందుకే బ్లైండ్‌గా ఫాలో అయ్యాడు. స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో రాజదాని నిర్మాణం కట్టబెట్టడాన్ని అందరూ వ్యతిరేకించారు. కేవలం సింగపూర్ (మిగతా 10వ పేజీలో)



## రియో వెలుగుల్లో...
# తెలుగమ్మాయి!



కేంద్రమంత్రి వెంకయ్యతో రజత పతక విజేత సింధు

***సింధు... సింధు... సింధు... గత వారంరోజులుగా దేశంలో ఒకటే చర్చ. తెలుగు రాష్ట్రాల్లో అయితే ప్రజలు, మీడియా ఇద్దరు ముఖ్యమంత్రులను మర్చిపోయారు. సింధు జపంలో మునిగిపోయారు.*** (మిగతా 10వ పేజీలో)



# ప్రశ్నలు లేవా ప్రశ్నించలేవా?
## పవనే పెద్ద ప్రశ్నార్థకం

***పవర్ స్టార్ పవన్ కళ్యాణ్... తెలుగు సినీ పరిశ్రమలో ఒక సంచలనం. ఆయన సినిమా వస్తుందంటే అభిమానులకు పండుగే! వ్యక్తిగత జీవితంలో వివాదాలు ఉన్నప్పటికి, వ్యక్తిత్వంలో, మానవత్వంలో, దాతృత్వంలో ఆయనకు మంచి గుర్తింపు వుంది. సినీ పరిశ్రమలో ఉన్నప్పటికి డబ్బుల కోసం దిగజారే మనిషి కాదు. డబ్బుల కోసం ఇతరులను పీడించే రకం కాదు. ఇండస్ట్రీలో పది మందికి సాయపడుతాడనే పేరుంది.***

సినిమాల్లో లాగా రాజకీయాలలో మంచి పేరు తెచ్చుకోవాలంటే కుదరదు. రాజకీయాలకు సినిమాకు చాలా తేడా వుంటుంది. తెలుగు సినీపరిశ్రమ నుండి తెలుగు రాజకీయాల్లోకి నాటి పెద్ద ఎన్టీఆర్ నుండి నేటి చిన్న ఎన్టీఆర్ వరకు ఎందరో వచ్చారు. ఈ రాజకీయాల్లో ఒక్క ఎన్టీఆర్ తప్పితే ఇంకెవరూ సక్సెస్ కాలేకపోయారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ తర్వాత అంతటి క్రేజున్న మెగాస్టార్ చిరంజీవి సైతం ఈ రాజకీయాల్లో రాణించలేకపోవడం చూస్తూనే వున్నాం.

ఈ రాజకీయాల్లోకి వచ్చే పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కూడా తన ఇమేజ్‌ను కోల్పోయాడు. 2009 ఎన్నికల్లో తన అన్న స్థాపించిన (మిగతా 10వ పేజీలో)



# విజయవంతంగా గడపగడపకు వైయస్సార్



సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం గడప గడపకు వైయస్సార్ కార్యక్రమం గురించి నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాకాణి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన గడపగడపకు వైయస్సార్ కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యం పార్టీకి చెందిన శాసనసభ్యులు, సమన్వయకర్తలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం, శాసనసభలో ఆ అంశాలను ప్రస్తావించి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం అన్నారు. ఈ కార్యక్రమం దృఢ సంకల్పంతో విజయవంతం చేసే దిశగా ప్రతి నియోజకవర్గానికి అనుభవజ్ఞులైన వారిని పరిశీలకులుగా నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యల్లసిరి గోపాల్‌రెడ్డి, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కొణిదెల సుధీర్, పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

# కామధేను బ్రీడింగ్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలి




అధికారులతో చర్చిస్తున్న ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా॥ మన్మోహన్‌సింగ్, కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరుజిల్లా చింతలదేవిలో నిర్మించనున్న జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌ను గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ మన్మోహన్‌సింగ్ సూచించారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన ఈ సెంటర్ నిర్మాణ పనులపై జిల్లా అధికారులతో సమీక్షించారు. చింతలదేవిలో 2400 ఎకరాలలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో మొక్కలు, గడ్డి పెంచాలన్నారు. పశువుల మేత, వాటికి కావాల్సిన ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు మాట్లాడుతూ అధికారులు పనులను వేగంగా పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ లీవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ కొండలరావు, పశుసంవర్ధక శాఖ జేడి శ్రీధర్‌కుమార్, డ్వామా పిడి హరిత తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు పేటలో నవజీవన్

ఎట్టకేలకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలును సూళ్ళూరుపేటలో స్టాపింగ్‌ను రైల్వే అధికారులు పునరుద్ధరించారు. దీంతో పేట వాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చెన్నై– అహమ్మదాబాద్‌ల మధ్య నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణీకుల సౌకర్యార్థం సూళ్ళూరుపేటలో నిలపాలని కోరినా, అందుకు వీలుపడదంలేదని ఈ నెల మొదటివారం నుంచి రైలు స్టాపింగ్‌ను రద్దుచేశారు. అయితే, అక్కడున్న ప్రజాసంఘాలు, జైన్ సోదరులు, స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు ఆందోళనకు దిగారు. ఈ విషయం జైన్ సంఘాల నాయకులు తిరుపతి ఎంపి వెలగపల్లి వరప్రసాద్ దృష్టికి తీసుకురాగా, ఆయన ఢిల్లీస్థాయిలో సంప్రదింపులు జరిపి, రైల్వే మంత్రి సురేష్‌ప్రభుతో సంప్రదించి మళ్ళీ స్టాపింగ్ పునరుద్ధరణకు హామీని సాధించారు. లోక్‌సత్తా నాయకులు శ్రీపతి రవీంద్ర తదితరులంతా కలసి ఈ విషయంలో చేసిన కృషితో ఎట్టకేలకు రైల్వే బోర్డు స్పందించి ఈ నెల 21 నుంచి స్టాపింగ్‌ను పునరుద్ధరించడంతో అక్కడి ప్రజలు, నాయకులు, ప్రజాసంఘాలవారం దరిలో ఆనందం వెల్లువెత్తింది. దీంతో ఆ రైలు డ్రైవర్‌కు, రైల్వే స్టేషన్ సిబ్బందికి అందరికీ వారు మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.




# చౌకగా బిఎస్ఎన్ఎల్ సేవలు

## టెలికాం ప్రిన్సిపల్ జీఎం రవిబాబు

అతి తక్కువ ఛార్జీలకే జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు అందజేస్తున్నామని జిల్లా టెలికం ప్రిన్సిపల్ జిఎం రవిబాబు తెలిపారు. ఈనెల 21న నెల్లూరులోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్‌ను కేవలం 49 రూపాయల అద్దెకే అందిస్తున్నామని, ఈ సౌకర్యం ఆరు నెలలపాటు వుంటుందని తెలిపారు. ల్యాండ్ ఫోన్ నుంచి ప్రతి ఆదివారం 24 గంటలు, మిగిలిన రోజుల్లో రాత్రి 9నుంచి ఉదయం 7గంటల వరకు దేశంలోని ఏ నెట్‌వర్క్‌కైనా ఉచితంగా మాట్లాడే సౌకర్యం వుందన్నారు. అదేవిధంగా, బ్రాడ్‌బ్యాండ్ అన్‌లిమిటెడ్ సౌకర్యం ప్రస్తుతం రూ. 470కే లభిస్తోందని, ఫోన్ సౌకర్యం ఉచితమని, ఎఫ్‌యుపి 10 జిబి వుంటుందని తెలిపారు. బ్రాడ్‌బాండ్ వైఫై మోడెంపై నూరుశాతం క్యాష్‌బుక్ సౌకర్యం వుందని, దీని ద్వారా ప్రతి నెలా ఫోన్ బిల్లులో నూరు రూపాయల రాయితీని పొందవచ్చని పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ సేవలపై వివరాలకు 0861 2306544 నంబర్‌కు సంప్రదించాలని ఆయన సూచించారు.

## నెల్లూరు సైంటిస్ట్ సతీష్‌రెడ్డికి...

# ఇంజనీరింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డ్



భారత రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారుడు, డిఆర్‌డిఓ క్షిపణి, వ్యూహాత్మక వ్యవస్థల విభాగం డైరెక్టర్ జనరల్, నెల్లూరీయుడు డాక్టర్ గంగ్ర సతీష్‌రెడ్డికి ఐఇఐ–ఐఈఈఈ ఇంజనీరింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. దేశ రక్షణలో అత్యంత కీలకమైన క్షిపణి రూపకల్పన, ఏరోస్పేస్ రంగాలలో చేసిన కృషికిగాను ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. ఆగస్టు 24వతేదీన బెంగుళూరులోని హోటల్ లలిత్ అశోక్‌లో జరిగిన ఐఇఐ(ఇండియా), ఐఈఈఈ(యూఎస్ఏ) ఏషియా పసిఫిక్ రీజియన్ సదస్సులో ఇస్రో ఛైర్మెన్ ఏ.ఎస్.కిరణ్‌కుమార్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రక్షణ రంగంలోనూ, క్షిపణుల రూపకల్పనలోనూ భారత్ స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందన్నారు. దేశ తక్షణ అవసరాలు, సమస్యల పరిష్కారానికి ఇంజనీరింగ్ విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. దేశ రక్షణకు సంబంధించిన అన్ని వ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేసుకునే క్రమంలో భారత్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఈఈ అధ్యక్షుడు డాక్టర్ భారీ ఎల్ సూప్ కూడా పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగా అబ్దుల్ కలాం కలల వారసుడిగా ఎదుగుతున్న సతీష్‌రెడ్డి కీర్తి కిరీటంలో ఎన్నో అవార్డులు, ప్రశంసలు చేరాయి. ప్రతి అవార్డు దేశ రక్షణలో తన బాధ్యతను పెంచుతుందన్న విషయాన్ని గుర్తుంచుకుంటూ దేశ సేవకు అంకితమైన మన నెల్లూరీయుడు, మహిమలూరు వాసి సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.


## నెల్లూరు నేతల పుష్కర స్నానాలు





కృష్ణానదిలో పుష్కర స్నానం చేస్తున్న కేంద్ర మంత్రి యం.వెంకయ్యనాయుడు, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# రద్దయిన చంద్రబాబు పర్యటన



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 25వ తేదీ నెల్లూరుజిల్లాకి రావాల్సి ఉండగా, విజయవాడలో అకాల భారీ వర్షాలతో హఠాత్తుగా రద్దయ్యింది. కలిగిరి మండలం పెద్దపాడులోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం వద్ద ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు కుమారుడు కార్తీక్ వివాహ రిసెప్షన్ వేడుకలను భారీగా ఏర్పాటు చేశారు. 23వ తేదీ కృష్ణ పుష్కరాలు ముగిసాయి. 24వ తేదీ పుష్కరాల విధులు ముగించుకుని తమ ఇళ్లకు బయలు దేరిన పోలీసు సిబ్బందిని సీఎం బందోబస్తు నిమిత్తం నేరుగా పెద్దపాడుకే పంపించారు. రెండువారాల పాటు ఇంటికి, కుటుంబసభ్యులకు దూరంగా గడిపి, ఇంకొద్ది గంటల్లో ఇళ్లకు చేరుకుంటామన్న ఆనందంలో వున్న నెల్లూరు పోలీసులకు సిఎం పర్యటన చికాకు తెప్పించింది. ఈ సీఎంకు ఇంకేం పనిలేదా, మనశ్శాంతి ఉండనీయడంలేదని తిట్టుకున్నారు. తీరా 25వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో విజయవాడలో భారీ వర్షం కారణంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సీఎం పర్యటనను రద్దు చేశారు. పెద్దపాడులో తెలుగుదేశం నాయకులు, నిర్వాహకులు మాత్రం నిరాశలో మునిగిపోగా... పోలీసులు, అధికారులు మాత్రం శుభ్రంగా విందు ఆరగించి హ్యాపీగా వచ్చేశారు.



# ఆనంకు ఆత్మకూరు 'దేశం'

- ఉడికిపోతున్న కన్నబాబు
- పట్టించుకోని చంద్రబాబు



*ఇతను నా మనిషి... నన్ను నమ్ముకునే ఉన్నాడు... గెలిచినా ఓడినా ఇతనికే సీటు ఇవ్వాలి... అనుకోవడానికి అతను వై.యస్.రాజశేఖరరెడ్డి కాదు... చంద్రబాబు. పగోడైనా, ప్రత్యర్థి అయినా గెలిచే సత్తా ఉన్నోడే తనోడు... గంట ముందు తనను తిట్టిన ఫర్వాలేదు. తనకు అవసరమున్నరోజు దగ్గరుంటే చాలు... ఇప్పుడు చంద్రబాబు రాజకీయాలకు ఆయన భక్తులే దిమ్మ తిరిగి మైండ్ బ్లాకై పడిపోతున్నారు.*

ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జ్ బాధ్యతలు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అప్పగించారు. ఈమేరకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఏడాది జనవరిలో ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరారు. చేరేటప్పుడే ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు బాధ్యతలు ఇచ్చేటట్లు మాట్లాడుకున్నారు. అయితే వెంటనే ఇస్తే అప్పటివరకు ఇన్‌ఛార్జ్‌గా వున్న కన్నబాబు కొంచెం గొడవ చేస్తాడన్న కారణంతో అతనిని లైన్‌లో పెట్టడానికి ఇంత కాలం ఆగారు. 2014ఎన్నికల్లో ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కన్నబాబు ఈ రెండున్నరేళ్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ వస్తున్నాడు. ఆనం చేరికను ఆయన బలంగానే వ్యతిరేకించాడు. నియోజకవర్గంలో కూడా ఆనంతో సంబంధం లేకుండా గ్రూపును మెయింటేన్ చేస్తున్నాడు. అయితే చంద్రబాబుకు ఆత్మకూరులో గెలుపు గుర్రం కావాలి. కన్నబాబు వల్ల వచ్చే ఎన్నికల్లో కూడా గెలవలేమని ఆయనకు తెలిసిపోయింది. ఆనం రామనారాయణరెడ్డి అయితే వైకాపా వాళ్లు అక్కడ ధీటైన అభ్యర్థిని వెదుక్కోవాలి. అందుకనే ఆనంకు ఇప్పటి నుండే పార్టీ కలరింగ్ ఇచ్చి రంగంలోకి దించాలన్న ఉద్దేశ్యంతో ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాడు. కన్నబాబు మంగళవారమే తన పుట్టినరోజు పండుగ చేసుకున్నాడు. బుధవారమే చంద్రబాబు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇన్‌ఛార్జ్ పదవిని ఊడబెరికాడు. కన్నబాబు అలిగి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. చంద్రబాబు ఇలాంటి కన్నబాబులను, ఇలాంటి బెదిరింపులను ఎన్ని చూసుంటే... ఎన్టీఆర్‌ను కూలేసి సీఎం అయ్యుంటాడు. అయినా చెరువు మీద అలిగినా, ఇప్పుడు చంద్రబాబు మీద అలిగినా రిజల్ట్ ఒకటిగానే ఉంటుంది కదా!

# నేత్రపర్వంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

## వైభవంగా సుదర్శన హోమం... శోభాయాత్ర



జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణ భగవానుని జన్మాష్టమి, విశ్వహిందూ పరిషత్ స్థాపనా దివస్ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, శ్రీ రంగనాథ కోలాట భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఈ నెల 25వ తేదీ ఉదయం 9గంటల నుండి నెల్లూరు విఆర్ కళాశాల మైదానంలో నేత్రపర్వంగా జరిగాయి. తొలుత గణపతిపూజ, నవగ్రహ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 11హోమగుండాలతో 44మంది పుణ్య దంపతులతో శ్రీరామాయణం మహేష్ స్వామి ఆధ్వర్యంలో సుదర్శన హోమం కార్యక్రమం వైభవంగా జరిగింది. సాయంత్రం 4గంటలకు గోపూజ విశేషంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి గోపికా కృష్ణుల వేషధారణలతో, కోలాటాలు పండరీ భజనలతో నెల్లూరు నగర పురవీధుల మీదుగా శోభాయాత్ర బయలుదేరి విఆర్‌సి గ్రౌండ్స్‌కు చేరుకుంది. అనంతరం ముఖ్యవక్తలు ధార్మిక ఉపన్యాసం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటి మేయర్ ఎం.ద్వారకానాథ్, విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ మోహన్‌రావు, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, పాఠశాల ప్రతినిధులు మైథిలి మనోహర్‌రెడ్డి, వాకాటి విజయ కుమార్‌రెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్య నాయుడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ఉపాధ్యక్షురాలు డా॥ మారం విజయలక్ష్మి, విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు ఎవిఆర్ మోహన్ రావు, మిడతల రమేష్, వేళ్ళపాళెం రాజ గోపాలరెడ్డి, దేగా మల్లారెడ్డి, విడుపుల పాటి సురేష్, మిద్దె శ్రీనివాసులు, అప్పల శ్రీధర్, బైసాని విశ్వనాథ్, పెరుమందూరు శశికుమార్, ఉర్లంకుల అనూరాధ, నెల్లూరు వెంకటరత్నం, అనుమాలశెట్టి వెంకట రాజేంద్రప్రసాద్, బొగ్గల రామకృష్ణయ్య తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు, చిన్నారులు విశేషంగా పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో భక్తిశ్రద్ధలతో కృష్ణ పూజ





నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో 25వ తేదీ కృష్ణాష్టమి వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ నెల్లూరు ప్రతినిధి డాక్టర్ సుకదేవస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కీర్తనలు, అభిషేకాలు, భజనల మధ్య బాలకృష్ణుడిని ఉయ్యాలలో వుంచి పూజలు నిర్వహించారు. అలాగే మహా హారతి, 108 వంటకాల నివేదన, వ్రత పూజలు, నందోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ సంస్థాపకులు భక్తి వేదాంత స్వామి శ్రీలప్రభుపాద వ్యాస పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి సావనీర్‌ను ప్రత్యేకంగా విడుదల చేశారు. ఉదయం గోశాలలో గోపూజను నిర్వహించారు. జన్మాష్టమి సందర్భంగా ఇంతకుముందు జరిగిన సాంస్కృతిక పోటీలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# 'ప్రభా'తం

అంబరాన్నంటే సంబరాలంటే రియో ఒలింపిక్సే. ఆ క్రీడోత్సవాల వైభవం అంతాఇంతా కాదు. ఎంతో ఉత్కంఠభరితంగా ఈ క్రీడా పోటీల్లో ప్రపంచదేశాల క్రీడాకారులంతా పోటీ పడి ఆడడం చూసినవారికి కన్నుల పండుగే. అందులోనూ బ్యాడ్మింటన్‌లో అమోఘమైన ప్రతిభతో రాణించి రజత పతకం సాధించి, విశ్వక్రీడా వేదికపై భరతమాత కీర్తిని రెపరెపలాడించిన ఘనత సింధూకే దక్కింది. క్రీడారంగంలో భారత కీర్తికిరీటానికి వెండివెలుగులను తాపడం చేసి ప్రపంచస్థాయిలో భారత్ కీర్తిపతాకను సగర్వంగా ఎగురవేసింది పివి సింధూ. బ్యాడ్మింటన్ స్టార్‌గా ఎదిగి, అసామాన్యమైన క్రీడాప్రతిభతో రియో ఒలింపిక్స్‌లో పాల్గొంది. ఎంతో గుండె నిబ్బరం, క్రీడాస్ఫూర్తితో ఆడి క్రీడాకారులందరికీ ఆమె స్ఫూర్తి దాయకంగా నిలిచింది. అయితే, స్వర్ణపతకం సాధించాలని ఎంతో పట్టుదలతో ఆడినా, అదృష్టం వరించలేదు. అయినా, విశ్వక్రీడల్లో రజతపతకం సాధించడమంటే.. ఆషామాషీ కాదు. విశ్వవిఖ్యాత క్రీడాకారులంతా పాల్గొనే ఈ ఒలింపిక్స్‌లో నిలవాలన్నా గెలవాలన్నా ఎంతో కష్టసాధ్యం. అనన్యసామాన్యమైన క్రీడాప్రతిభ వుంటే తప్ప అసలు ఒలింపిక్స్ బరిలో దిగలేం. సాధించింది ద్వితీయమే అయినా దేశానికి అద్వితీయమైన ఖ్యాతిని తీసుకు వచ్చింది సింధూ. తొలినుంచి బ్యాడ్మింటన్ స్టార్‌గా ఎదిగిన సింధూ, చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి బ్యాడ్మింటన్‌లో అమోఘమైన నైపుణ్యాన్ని సొంతం చేసుకుంది. క్రీడాశిక్షకుడు, ప్రపంచప్రఖ్యాత క్రీడాకారుడు అయిన కోచ్ పుల్లెల గోపిచంద్ శిక్షణ ఆమె క్రీడా ప్రతిభకు మరింత పదును పెట్టింది. రియోలో అత్యద్భుతమైన విజయాన్ని సాధించి క్రీడారంగంలో భారత్ పేరును విశ్వవిఖ్యాతం చేసిన సింధు దేశ వ్యాప్తంగా అందరి ప్రశంసలూ అందుకుంటోంది. ఇంతటి అమోఘమైన విజయాన్ని సాధించిన సింధును, ఆమెకు శిక్షణ ఇచ్చిన ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్‌ను యావద్భారతజాతి సగర్వంగా వేనోళ్ళ ప్రశంసిస్తోంది. గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీని స్థాపించి విశ్వవిఖ్యాత క్రీడాకారులైన సైనా నెహ్వాల్, సింధూ వంటి ఆణిముత్యాలను అందిస్తుండడం అపూర్వమైన విషయం. ఏదేమైనప్పటికీ, ఈ విశ్వక్రీడల్లో నిలిచి గెలిచి రజతం సాధించిన..తెలుగింటి ముద్దుబిడ్డగా సింధూ, తెలుగువారి ఖ్యాతిని జగద్విదితం చేయడం తెలుగుజాతికే కాదు, భరతజాతికే గర్వకారణం. అందులోనూ, ప్రపంచంలో మరే దేశానికీ లేని ఎంతో మహనీయమైన 'మాత' అనే పేరుతో విశ్వ విఖ్యాతమైన దేశం..మన భారతదేశమే. 'భరతమాత' ముద్దుబిడ్డలైన ఎందరో మహిళలు అన్ని రంగాల్లో ఎంతో దీక్షతో ముందుకు సాగుతూనే వుండడం మనకెంతో గర్వకారణం. ఈ నేపథ్యంలో క్రీడారంగంలోనూ మహిళారత్నాలు పాల్గొని విశ్వ విఖ్యాతమైన రియో క్రీడల్లోనూ మెరుపులు మెరిపించి తమదైన ప్రజ్ఞతో పతకాలు సాధించిన సింధు (రజతం), రెజ్లర్ సాక్షి మాలిక్ (కాంశ్యం)ల కృషి ఎంతో అభినందనీయం. మహిళలైనప్పటికీ భరతజాతి ఖ్యాతికోసం విశ్వక్రీడల్లో విజయం కోసం వారు పడిన ఆరాటం..పోరాటం చూసి భరతమాత హృదయం పులకించిపుంటుంది. భరతమాత ముద్దుబిడ్డలైన ఆ క్రీడాకారిణులకు ఇవే..శతసహస్ర వందనాలు..అభినందన శుభచందనాలు. ఈ శుభ సందర్భంలోనే సింధుకు దేశంలోని అత్యున్నత క్రీడా పురస్కారమైన 'రాజీవ్ ఖేల్‌రత్న' అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించడం సంతోషకరం. క్రీడారంగంలో అసామాన్యమైన ప్రతిభ కనపరచినవారికి ఇచ్చే ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు క్రీడాఆణిముత్యం సింధూను వరించడం ఎంతో ఆనందకరం. సింధుతో పాటు, రెజ్లింగ్‌లో కాంశ్య పతకం సాధించిన సాక్షిమాలిక్, పతకం రాకపోయినప్పటికీ చివరివరకు శాయశక్తులా పోరాడి త్రుటిలో పతకం కోల్పోయిన దీపా కర్మాకర్ (జిమ్నాస్టిక్స్), జీతూరాయ్ (షూటింగ్) లకు ఖేల్‌రత్న అవార్డులు ప్రకటించడం విశేషం. తద్వారా క్రీడారంగానికి కేంద్రం మంచి ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లే. ఎంతో విశిష్టమైన ఈ ఖేల్‌రత్న అవార్డు విజేతలకు పతకం, ప్రశంసాపత్రంతోపాటు ఏడున్నర లక్షల వంతున నగదు బహుమతులు కూడా అందజేస్తారు. ఇలా ఒకేసారి నలుగురు క్రీడారత్నాలకు కేంద్రం ఖేల్‌రత్న అవార్డులు ప్రకటించడం గొప్ప విషయం. అయితే, ఈ సందర్భంగా ఇక్కడొక మాట చెప్పక తప్పదు. ఈ విశ్వక్రీడాసంబరాలకు భారత క్రీడాకారులు 119 మంది వెళ్తే కేవలం రెండంటే రెండు పతకాలు మాత్రమే వచ్చాయనుకున్నప్పుడు కాస్తంత బాధ కలుగుతుంది. బీజింగ్ ఒలింపిక్స్‌లో మూడు పతకాలు, లండన్‌లో రెండు వెండిపతకాలతో పాటు నాలుగు కాంశ్యపతకాలు సాధించిన భారత్ ఈసారి రియోకి రెట్టింపు ఉత్సాహంతో వెళ్ళినా.. రెండు పతకాలు మాత్రమే సాధించగలగడం కాస్తంత నిరుత్సాహం కలిగించేదే. అయినా.. జరిగిపోయినదానికి వగచి ప్రయోజనం లేదు. గెలుపు ఓటములు సహజం. మరింత పట్టుదలతో ముందుకు సాగడమే ధీర లక్షణం. ఆణిముత్యాల వంటి క్రీడాకారులకు మనదేశంలో ఎలాంటి కొదవలేదు. అలాంటి క్రీడాకారులను క్రీడారత్నాలుగా తీర్చిదిద్దుకోవడంలోనే వున్నది మన పరిజ్ఞానమంతా. క్రీడాప్రతిభే ప్రాతిపదికగా క్రీడాకారులకు కొత్త ఉత్సాహాన్ని అందివ్వాలి. ఎందరో అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు మనకున్నా..మరిన్ని విజయాలు చేరువకాకపోవడం ఎందువల్లనో విశ్లేషించుకోవాలి. మనకన్నా చిన్నదేశాలు మనకంటే మిన్నగా పతకాలు సాధించడాన్ని మనం స్ఫూర్తిగా తీసుకోవాలి. ఎక్కడా లోపాలు లేకుండా చూసుకోవాలి. ఓటముల నుంచే విజయాలకు బాటలు వేసుకోవాలి. ఏదేమైనా భవిష్యత్తులో భారత్ మరిన్ని పతకాలు సాధించాలన్నదే అందరి ఆకాంక్ష. రియోలో సింధు సృష్టించిన సంచలన విజయం భవిష్యత్‌లో భారత్‌కు మరిన్ని విజయాలకు బాట కావాలి. విశ్వక్రీడా రంగంలో భారత్ ధీటుగా రాణించాలి. భరతమాత కీర్తిపతాక ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడాలి..అదే అందరి ఆకాంక్ష.

## దేశ కీర్తి పుత్రికలు



విశ్వవిఖ్యాతమైన రియో ఒలింపిక్ క్రీడల్లో బ్యాడ్మింటన్ స్టార్ సింధూ రజత పతకం సాధించి భారత్ కీర్తికిరీటానికి వెండి వెలుగులు తాపడం చేసింది. తద్వారా విశ్వక్రీడా వేదికపై భారతదేశ కీర్తి పతాకను రెపరెప లాడించింది. అదేవిధంగా రెజ్లర్ సాక్షిమాలిక్ కాంశ్య పతకం సాధించింది. వీరిద్దరూ మహిళలే అయినా, భరతమాత ముద్దుబిడ్డలైన వీరు..విశ్వక్రీడా సంబరాల్లో అత్యద్భుతమైన ప్రతిభతో రాణించి భారతదేశ ఖ్యాతిని నిలబెట్టడం..భారతీయులందరికీ గర్వకారణం.

# రెండంకెల వృద్ధిరేటే లక్ష్యం

- ఏజేసీ రాజ్‌కుమార్




ప్రాథమిక రంగాలలో రెండంకెల అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ – 2 ఆర్.ఎస్. రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరులోని పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కృష్ణా పుష్కరాల చర్చానీయంశంలో భాగంగా ప్రాథమిక రంగాల మిషన్ గురించి చర్చ గోష్టి జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక రంగాలైన వ్యవసాయం మరియు దాని అనుబంధశాఖలు రెండంకెల వృద్ధిరేటు సాధించే విధంగా కృషి చేయాలని చర్చలో పాల్గొన్న అభ్యుదయ రైతులను ఉద్దేశించి అన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించడానికి కృషి చేయాలన్నారు. రైతులకు ప్రధానంగా వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాలు సందర్శించే విధంగా పర్యటనలు ఏర్పాటుచేసి వారికి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సంవత్సరం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసినందువల్ల జిల్లాలో రెండు పంటలు పండాయన్నారు. గత సంవత్సరం వ్యవసాయ అనుబంధ రంగాలలో 9.5శాతం వృద్ధి రేటు సాధించిందన్నారు. ఈ సంవత్సరం 15 శాతం అభివృద్ధి రేటు చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. మత్స్యశాఖ రెండంకెల వృద్ధిని సాధించడానికి కోబియా, పాంపినో, మడపీతలు వంటి చేపలను పెంచే విధంగా హేచరీలను ఏర్పాటు చేసి తద్వారా విదేశాలకు ఎగుమతులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జె.డి. హేమమహేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జె.డి. శ్రీధర్‌కుమార్, మత్స్యశాఖ జె.డి. సీతారామరాజు, ఉద్యానవన శాఖ జె.డి. ఉమాదేవి, అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం పంతులుకు నివాళులు



ఏపి మాజీముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి సందర్భంగా ఆదివారం నెల్లూరు మద్రాసు బస్టాండ్ సెంటర్ వద్దనున్న ప్రకాశం పంతులు విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘాలు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడే కాక, బ్రిటీష్‌వారి సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి నిలదీసిన ధీరోదాత్తుడన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం బ్యారేజ్‌ను పునఃనిర్మించి దేశానికి ఆదర్శమైన ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. దీనికి గుర్తింపుగా ప్రస్తుత ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో నిర్మించే ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిలో సచివాలయ బ్లాక్‌కు ప్రకాశం పంతులు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.




## జగన్ యజ్ఞం

పుష్కరాలను పురస్కరించుకుని చంద్రబాబు దేవాలయాలను కూలిస్తే జగన్ ఖండించాడు. స్వామి స్వరూపానందేంద్రతో యజ్ఞం చేయించి గంగలో మునిగాడు. గోదావరి, కృష్ణ పుష్కర స్నానం చేశాడు. రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన హిందువుల మన్ననలు పొందకుండా ఎవరూ అధికారం చేపట్టలేరు. జగన్ కుటుంబానికి ఉన్న క్రైస్తవ మత పిచ్చి 2014 ఎన్నికల్లో అతనిని చాలామందికి దూరం చేసింది. చంద్రబాబు అనుచరులు స్వామీజీలను తిడుతుంటే, జగన్ స్వామీజీల ఆశీస్సులు పొందుతున్నాడు. ఉండవల్లి అరుణ్‌కుమార్ వంటి బ్రాహ్మణ మేధావుల అండ వుంటే భవిష్యత్‌లో జగన్‌దే అధికారం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## దేశానికి పట్టిన దరిద్రం


కొందరు కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తుంటే వీళ్లు దేశానికి పట్టిన దరిద్రమేమోనని పిస్తోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్ ఆక్రమిత కాశ్మీర్ అంటూ సంచలనం రేపిన దిగ్విజయ్‌సింగ్ లాంటి చెత్త నాయకులను దేంతో కొట్టినా పాపం లేదు. ఓ పక్క ప్రధాని నరేంద్ర మోడీ బెలూచిస్థాన్ అంశాన్ని లేవనెత్తి పాకిస్థాన్‌పై ఎదురుదాడికి దిగితే, దిగ్విజయ్‌సింగ్ లాంటి పనికిమాలిన నాయకులు ఆ పోరాటానికి తూట్లు పొడుస్తూ, పాకిస్థాన్ తొత్తుల్లాగా వ్యవహరిస్తుండడం సిగ్గుచేటు.

సి.వి.నారాయణ, నెల్లూరు.

## మీ సొంత డబ్బులివ్వండి

ఒలింపిక్స్‌లో రజత పతక విజేత సింధును దేశం యావత్తు అభినందిస్తోంది. ఆమె ఆట తీరు స్ఫూర్తిదాయకం. ఆమె దేశానికే గర్వకారణం. అయితే సింధు రజత పతకం గెలవగానే ఒక్కో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నజరానాలు ప్రకటించాయి. ఇది ఎవరి డబ్బు! ప్రజల రక్తమాంసాలు పీల్చి పన్నుల రూపంలో వసూలు చేసిన ఈ డబ్బును కావాలంటే క్రీడా మైదానాల అభివృద్ధికి ఖర్చు పెట్టండి. సింధుకు నజరానాగా మీ పార్టీల ఖాతాలో డబ్బు లేదంటే మీ సొంత అకౌంట్లలో డబ్బు ఇవ్వండి. అంతేగాని అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన ప్రజాసొమ్మును ఇలా వ్యక్తిగత బహుమతులుగా ఇస్తూ దుర్వినియోగం చేయడమేంటి?

నగేష్, కావలి.



# సింహపురి 'సింధు'వు

**నెల్లూరుతో ప్రత్యేక అనుబంధం**

***ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ రజత పతకం విజేత పూసర్ల వెంకట సింధుది నెల్లూరు కాకపోయినా ఈ నగరంతో ఆమెకు ప్రత్యేక అనుబంధం వుంది. బ్యాడ్మింటన్‌లో సింధును తొలిసారి ఛాంపియన్ చేసింది నెల్లూరే!***

2008లో నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయిలో అండర్-14 క్రీడాకారులకు శిక్షణా శిబిరం నిర్వహించారు. నెలరోజుల పాటూ నిర్వహించిన



నెల్లూరులోని గూడూరు రూరల్ సిఐ బి.శ్రీనివాసరెడ్డి నివాసంలో మ్యాచ్‌ను తిలకిస్తున్న సింధు అక్క దివ్య

శిబిరంలో సింధు పాల్గొంది. బ్యాడ్మింటన్‌లో సింధు ప్రతిభను గుర్తించిన అప్పటి జిల్లా కలెక్టర్ యం.రవిచంద్ర ఆమెను హైదరాబాద్‌లోని పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేర్పించి శిక్షణ నిప్పించారు. 2010లో నెల్లూరులో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-15 పోటీలలో పి.వి.సింధు ఛాంపియన్‌గా నిలిచింది. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో జాతీయ స్థాయి పోటీలలో అడుగుపెట్టింది. ఈ విధంగా సింధుకు తొలి విజయతిలకం దిద్దింది సింహపురే కావడం గమనార్హం. నెల్లూరు నుండి ఆమెకు లభించిన శుభారంభమే ఆమెను విశ్వవిజేతగా నిలిపింది.

## నెల్లూరులో కోలాహలం...

పి.వి.సింధు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో నెల్లూరులో పెద్దఎత్తున కోలాహలం కనిపించింది. సింధు ఎవరో తెలియని వాళ్లు కూడా ఆమె గెలవాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులందజేశారు. ఈ రెండు మ్యాచ్‌లు జరుగుతున్నంతసేపు ఆడ మగ తేడా లేకుండా సీరియల్స్‌ను కూడా పక్కన పెట్టేసి ఎంతో ఉత్కంఠతతో చూస్తుండి పోయారు.

రియోలో సింధు ఆడిన సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను ఆమె అక్క పి.దివ్య నెల్లూరులోనే వుండి టీవీలో తిలకించడం విశేషం. దివ్య నారాయణ మెడికల్ కాలేజీలో చదువుతోంది. సింధు తండ్రి రమణ జాతీయ వాలీబాల్ ప్లేయర్. గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డికి మంచి మిత్రుడు. వీళ్ల స్నేహం కూడా వాలీబాల్ వద్దే ఏర్పడింది. ఈ రెండు మ్యాచ్‌లను కూడా దివ్య నెల్లూరు పుట్టవీధిలో వున్న శ్రీనివాసరెడ్డి ఇంట్లోనే వుండి తిలకించింది. సింధు రజత పతకం సాధించాక ఆ ఇంట్లోనే సంబరాలు జరుపుకుంది. మొత్తానికి సింధు తన రజత పతక విజయంలో నెల్లూరుకు కూడా ఒక జ్ఞాపకాన్ని ఇచ్చింది.

# ఎవరు చెబితే చెయ్యాలి!

**• మీమాంసలో కార్పొరేషన్ సిబ్బంది**



నెల్లూరుజిల్లాలో పనిచేసే అవకాశం వస్తే ఉద్యోగులు ఆనందంతో ఎగిరి గంతేస్తారు. నెల్లూరు నగరపాలక సంస్థలో పని చేయాలంటే మాత్రం బెదిరిపోతున్నారు. పాడేరు ఫారెస్ట్‌కైనా వెళతామంటున్నారు గాని, నెల్లూరు కార్పొరేషన్‌కు వస్తామని మాత్రం చెప్పడం లేదు. నెల్లూరు కార్పొరేషన్‌లో సామాన్య ప్రజలకే కాదు, అధికారులకు సైతం సతాయింపులెక్కువయ్యాయి. ఎవరి మాట వినాలో తెలియక, ఎవరి ఆదేశాలను పాటించాలో అర్ధంకాక, ఎవరి మాట వింటే ఎవరికి కోపం వస్తుందోనన్న భయంతో ఉద్యోగాలు వెలగబెడుతున్నారు.

నెల్లూరు కార్పొరేషన్‌లో నాకు తెలియకుండా ఏమీ జరగడానికి వీల్లేదని మున్సిపల్ మంత్రిగా పి.నారాయణ ఇంతకు ముందే హుకుం జారీ చేసి వున్నాడు. నెల్లూరు కార్పొరేషన్‌లో నాయకుడికొక వర్గం వుంది. అజీజ్ వర్గం, ఆనం వర్గం, అనిల్ వర్గం, ఆదాల వర్గం, సోమిరెడ్డి వర్గం, కోటంరెడ్డి వర్గం... ఇక్కడ పార్టీల ప్రసక్తి లేదు... అంతా వర్గాలమయమే! ఒకరితో ఒకరికి పడదు. అధికారపార్టీలోని అజీజ్, ఆనం వర్గాలే ఇటీవల పెద్దఎత్తున కుమ్ములాడుకుని పత్రికలకెక్కాయి. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ జోక్యం చేసుకుని నెల్లూరు కార్పొరేషన్‌లో "ఏం జరిగింది, ఏం జరుగుతోంది, ఏం జరగబోతోంది... నాకు తెలియాలి" అంటూ ఆర్డర్ వేశాడు. శానిటేషన్ సిబ్బందిని మేయర్ తన ఇష్టానుసారంగా బదిలీ చేయలేని పరిస్థితి వచ్చింది. దీంతో మంత్రి మీద మేయర్‌కు అసహనం మొదలైంది. అదీగాక నెల్లూరులో భూగర్భడ్రైనేజీ, మంచి నీళ్ళకు సంబంధించిన 11వందల కోట్లు హడ్కో నిధుల టెండర్లు కూడా మేయర్‌తో పని లేకుండానే మంత్రుల స్థాయిలో జరిగిపోయాయి. దీంతో ఆల్‌రెడీ ఎసిడిటితో బాధపడుతున్నోడికి పచ్చి మిరపకాయ బజ్జీ తినిపించినట్లయ్యింది అజీజ్ పరిస్థితి. ఈ దశలో అతను మంత్రి నారాయణతో అమీతుమీకి సిద్ధమయ్యాడు. ఇటీవల విజయవాడలో తెలుగుదేశం యువరాజు లోకేష్‌ను కలిసి నెల్లూరు కార్పొరేషన్‌లో తనను ఎవరు ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నది చెప్పుకున్నాడు. తన వెనుక 40వేల మైనార్టీల ఓట్లున్నాయని లోకేష్‌ను నమ్మించాడు. ఆయన భరోసాతోనే ఇప్పుడు మంత్రి నారాయణను లెక్కచేయడం లేదు. నెల్లూరు కార్పొరేషన్‌లో ఇక నుండి నాకు తెలియకుండా ఏదీ జరగకూడదు, మంత్రి చెప్పినా సరే.. నా ఆమోదం కానిదే చీమ కూడా కదలకూడదు అనే తరహాలో ఆజ్ఞలు చేశారు.

దీంతో అధికారులు మేయర్, ఇతర నాయకుల మధ్య రెండు చెక్కల మధ్య అప్పడంలా నలిగిపోతున్నారు.

# దాహం వేస్తే బావులు తవ్వుతారా?

**- కోటంరెడ్డి**



దాహం వేసాకే బావులు తవ్వడం మొదలుపెట్టే సాంప్రదాయాన్ని నెల్లూరు కార్పొరేషన్ అధికారులు ఇంకా మానుకోక పోవడం శోచనీయమని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 22న ఆయన బుజబుజ నెల్లూరులో ప్రజాబాట నిర్వహించారు. 20రోజులుగా తాము తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పగా ఎమ్మెల్యే స్పందించారు. 20రోజులుగా ఇక్కడ మంచినీళ్లు లేకుంటే కార్పొరేషన్ అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడ సమస్య పరిష్కారానికి 10రోజుల పాటూ సొంతంగా రెండు ట్యాంకర్లతో మంచినీళ్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. 10రోజుల లోపు ఇక్కడ మంచినీటి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే బాధితులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైకాపా నాయకులు ఖాదర్ బాషా, శ్రీహరి యాదవ్, ఇర్షాద్, షబ్బీర్, రాజేష్, మహమ్మద్, సుబ్బరాయుడు, హరినాయుడు, జమీలమ్మ, షాకీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## 'దేశం' బలహీనతలే...

# వైకాపాకు బలమా?

ఆంధ్రప్రదేశ్‌లోనే నెల్లూరుజిల్లా రాజకీయాలు విలక్షణంగా ఉంటాయి. ఇక్కడ ఎన్నికల ఫలితాలు భిన్నంగా ఉంటుంటాయి. ఈ జిల్లా ప్రజలు ట్రెండ్‌ను సెట్ చేస్తారే గాని, ట్రెండ్‌ను ఫాలో అవ్వరు. ఇలాంటి చైతన్యవంతమైన జిల్లాలో తమ పట్టును నిలుపుకునేందుకు, పటిష్టంగా ఉండేందుకు ప్రధాన రాజకీయపార్టీలు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో నెల్లూరుజిల్లాలో మున్ముందు ఏ పార్టీ బలపడనుందన్నది ప్రధాన చర్చనీయాంశం.

ఈరోజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండే జిల్లాల్లో మొదటిది నెల్లూరు జిల్లానే! కడప, కర్నూలు వంటి జిల్లాల్లో వైకాపా ఎమ్మెల్యేలు జిల్లాకు ఇద్దరు ముగ్గురు లెక్కన పోయినా, నెల్లూరుజిల్లాలో మాత్రం ఒకే ఒక ఎమ్మెల్యే వెళ్లాడు. ఆరుగురు వైకాపా ఎమ్మెల్యేలు ఈ జిల్లాలో జగన్‌కు బలమైన అండగా నిలిచారు.

2014ఎన్నికల్లో 10 అసెంబ్లీలకు గాను 7 సీట్లు వైకాపాకు వచ్చాయి. నెల్లూరు ఎంపీగా పోటీ చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆర్ధికంగా సపోర్ట్ చేసుంటే ఉదయగిరి, కోవూరులో కూడా గెలిచి ఉండేవాళ్లు. అయితే, అసలు జగనే సక్రమంగా ఎలక్షన్ చేసుంటే అధికారమే వచ్చుండేదనుకోండి! 2014కు ఇప్పటికి పార్టీల పరిస్థితిలో ఏమన్నా మార్పు వచ్చిందా అన్నది ప్రశ్న? వివిధ కోణాల్లో నుండి చూస్తే కొత్తగా సర్వేపల్లి, ఆత్మకూరులలో తప్పితే తెలుగుదేశం పార్టీ పుంజుకున్నదేమీ లేదు. అన్నిచోట్లా ప్రభుత్వం మీద వ్యతిరేకత బలంగానే కనిపిస్తోంది. దీనిని వైకాపా నాయకులు ఎంతవరకు తమ బలంగా మలచుకుంటారన్నదే సందేహం. వైకాపా ఎమ్మెల్యేలు ఆరుమంది కూడా ప్రజల్లో ఉంటున్నారు. (మిగతా 11వ పేజీలో)



# ఆరు నెలలయ్యింది...
# ఇక కమిషనర్‌కి బదిలీ టైమొచ్చింది?



భారత రాజ్యాంగంలో వ్రాసిన ప్రకారం రాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు.. ప్రధాని పదవీ కాలం ఐదేళ్లు... ఎంపీ, ఎమ్మెల్యేల పదవీ కాలం ఐదేళ్లే... రాజ్యాంగం ప్రకారమే ఈ పదవీకాలాలు అమలు జరుగుతున్నాయి. అదేం విచిత్రమోగాని నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించి ఏ రాజ్యాంగంలో, ఏ చట్టంలో రాయకుండానే ఇక్కడికొచ్చిన కమిషనర్లు ఆరు నెలలు తిరక్కముందే బదిలీ అవుతున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌కు ఇదో సాంప్రదాయంగా మారినట్లుంది.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్లుగా ఇప్పటికే ముగ్గురు కృష్ణులు మారారు. ఇప్పుడు నాలుగో కృష్ణుడు కూడా మారడానికి సిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కమిషనర్‌గా వున్న వెంకటేశ్వర్లు బదిలీ ప్రయత్నాల్లో వున్నారు. తనను ఇక్కడ నుండి తప్పించి విజయవాడలోనో, గుంటూరులోనో, లేదంటే మున్సిపల్ పరిపాలనా కార్యాలయంలోనో పడేయండంటూ ఆయన ప్రభుత్వానికి మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. నెల్లూరంటే చేపల పులుసు, రొయ్యల వేపుడు, మొలగొలుకుల బియ్యం అని ఊహించుకుని వచ్చాడు. కార్పొరేషన్ కమిషనర్‌గా ఈ ఆర్నెళ్లకే ఆయనకు పరిస్థితి అర్ధమైంది. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డానని బాధపడుతున్నాడు. అదీగాక ఇటీవల ఏసిబి అధికారులు దాడిచేసి లంచం తీసుకుంటుండగా ఏసిపి మునిరత్నంను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం, తాము తీసుకుంటున్న లంచాల్లో కమిషనర్‌కు వాటా వుందని చెప్పడం వంటివి కమిషనర్‌ను షాక్‌కు గురిచేశాయి. అదీకాకుండా కార్పొరేషన్‌లో పెత్తనం ఒకరిది కాకుండా పోయింది. మంత్రి ఓ పక్క, మేయర్ ఇంకో పక్క.. మధ్యలో ఆనం, ఆదాల, సోమిరెడ్డి వర్గీయుల నుండి ఒత్తిళ్లు... ఈ సతాయింపులు తట్టుకుని నిలబడటం కూడా కష్టమే! ఈ బాధలు భరించలేకే ఆర్నెళ్లకే నెల్లూరు కార్పొరేషన్ మీద విరక్తి కలిగి ఆయన బదిలీ కావాలనుకుంటున్నాడు.

## హజ్‌యాత్రకు జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్నారు. ఈమేరకు సెప్టెంబర్ 5 నుండి 25వ తేదీ వరకు ఆయన సెలవు పెట్టనున్నారని తెలుస్తోంది. హజ్ యాత్రలో భాగంగా పవిత్ర స్థలం మక్కాను సందర్శించనున్నారు.

## అంధ బాలబాలికలకు గోపిశెట్టి ట్రస్ట్ వితరణ



స్వర్గీయ గోపిశెట్టి శంకరయ్య ఆశయాల మేరకు ఆయనచే స్థాపించబడిన గోపిశెట్టి శంకరయ్య ఛారిటబుల్ ట్రస్ట్ దశాబ్ద కాలంగా సమాజానికి సేవలు అందిస్తోంది. అందులో భాగంగా అంధులైన బాలబాలికలకు అనాధలైన బాలబాలికలకు పోషకాహారం అందజేసేందుకుగాను విశ్వభారతి అంధుల పాఠశాలకు రూ.10వేలు, విశ్వనేత్ర అంధుల పాఠశాలకు రూ.31వేలు, ప్రగతి ఛారిటీస్‌కు రూ.30వేలు, వాత్సల్య శరణాలయానికి రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని ఆ సంస్థల మేనేజింగ్ ట్రస్టీ జె.వి.రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు, ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ జె.వి.రెడ్డి, ట్రస్టీలు ఒంటేరు వెంకటకృష్ణారెడ్డి, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, సిద్ధవరపు రామకృష్ణారెడ్డి, మోడెం కోటారెడ్డి పాల్గొన్నారు.

## రిచ్‌లో చిన్నపిల్లలకు అన్ని సేవలు

- డాక్టర్ టి.రవికుమార్



రవి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చిన్నపిల్లలకు అన్ని రకాల వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని రవి మల్టీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ ఛైర్మన్ డా॥ టి.రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని అతిథి గ్రాండ్ హోటల్‌లో అధునాతన వైద్య విధానాలపై ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్, నెల్లూరు, కంచి కామకోటి చైల్డ్ హాస్పిటల్, చెన్నై వారి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యనిపుణులు రాహుల్ ఆనందయాదవ్, బి.రామచంద్రన్, శ్రీకాంత్‌కుమార్ మలినేని చిన్నపిల్లల వైద్యంలో వస్తున్న అధునాతన వైద్యవిధానాలపై అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిన్నపిల్లల ఊపిరితిత్తుల వైద్య నిపుణులు సోమ శివచాలన్, చర్మవ్యాధుల నిపుణుల రాంకుమార్, ఈఎన్‌టి సర్జన్ తిరునావుక్కరసు, న్యూరో డెవలప్‌మెంట్ వైద్య నిపుణులు శరవణానంద్ శివనిధి, హెమలాజిస్టు దీన్ దయాన్, శస్త్ర చికిత్స వైద్యులు ఎస్.నమఃశివాయం, పవన్‌కుమార్ నిమ్మల అంతర్జాతీయంగా వస్తున్న వైద్యవిధానాలపై పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, కడప జిల్లాల్లోని చిన్నపిల్లల వైద్యనిపుణులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

- కలెక్టర్ స్కెచ్

## గ్రీవెన్స్‌లో బయోమెట్రిక్



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రీవెన్స్‌డేలో అధికారులు సక్రమంగా హాజరయ్యేందుకు కలెక్టర్ ముత్యాలరాజు పక్కా స్కెచ్ వేశారు. గ్రీవెన్స్ డే వద్ద బయోమెట్రిక్ మిషన్ పెడుతున్నారు. దీనివల్ల గ్రీవెన్స్‌డేకు అధికారులు ఎవరెవరు వచ్చారు, ఏ టైంకు వచ్చారన్నది పక్కాగా తెలిసిపోతుంది. అధికారులు సక్రమంగా వస్తే వచ్చిన అర్జీదారులు తమ పనులు ముగించుకుని తొందరగా వెళ్లిపోతారు.

## ఐల్యాండ్ కుదింపు ఆగిపోయిందా?

నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌కు అవరోధంగా వున్న విగ్రహాల ఐల్యాండ్‌లను తగ్గించాలని జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ శ్రీకారం చుట్టడం తెలిసిందే! అప్పటికీ మద్రాసు బస్టాండ్ వద్ద నెహ్రూ బొమ్మ, ట్రంకురోడ్డు వద్ద ఇందిరమ్మ బొమ్మ(అంతా ఒకే ఫ్యామిలీ) ఐల్యాండ్‌లను తగ్గించారు. ఇప్పుడు అక్కడ ట్రాఫిక్ ఫ్రీగానే వుంది. ఐల్యాండ్‌లు తగ్గించిన ఫలితం కనపడుతోంది. ఇక పదికిపైగా ఐల్యాండ్‌లను తగ్గించాలన్నది జాబితాలో వున్నా, ఇంకా మిగతావాటి జోలికి పోలేదు. ఈ ఐల్యాండ్‌లను తగ్గిస్తే బాగుంటుందని ప్రజల కోరిక. తమ ఐల్యాండ్‌లు తగ్గాయని విగ్రహాల రూపంలో వున్న ఆ మహనీయులు ఏమీ ఫీల్ కారులే! ఎస్పీ తక్షణ కర్తవ్యం మొదలుపెడితే మంచిది.

## చవితి చందాల హడావిడి

వినాయక చవితి చందాల గోల అప్పుడే మొదలైంది. ఓ పక్క వృత్తి కళాకారులు వినాయకుని భారీ విగ్రహాల తయారీలో నిమగ్నమై వున్నారు. నెల్లూరులోనే కాకుండా ముఖ్యమైన పట్టణాలలో, మండల కేంద్రాలలో కూడా బొమ్మలు తయారు చేస్తున్నారు. బొమ్మలు తయారు చేసే వాళ్లు ఎక్కువ కావడంతో గిరాకీ తగ్గి శ్రమ తప్ప నాలుగు రూపాయలు మిగలడం లేదని తయారీదారులు వాపోతున్నారు.

ఇక గ్రామాలలో, ఆయా సెంటర్‌లలో పోటీలు పడి విగ్రహాలు పెట్టడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ విగ్రహాల ధాటికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు బెంబేలెత్తిపోతున్నారు. వాళ్లకి చందాల తాకిడి మొదలైంది. ఇక వ్యాపారాలు పెద్దగా లేవు. రియల్ ఎస్టేట్ అసలే లేదు. జనానికి ఆదాయాలు అంతంత మాత్రంగా వున్నాయి. ఈ కరువు కాలంలో చవితి చందాలు వారికి కష్టంగా మారుతున్నాయి.

## రోగులకు పండ్లు, రొట్టెలు



నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు డిఎంహెచ్ఓ రిటైర్డ్ ఎఓ చంద్రశేఖర్‌రావు వర్ధంతి సందర్భంగా వారి మనుమడు సాత్విక్ సహకారంతో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ నెల్లూరు నగరంలో విస్తృత స్థాయిలో నేస్తం ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. పలు సేవా కార్యక్రమాలు చేయాలనుకునే వారికి వారధిగా ఉంటూ వాలంటీర్ల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేస్తం ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎంహెచ్ఓ ఈదూరు సుధాకర్, శివ, సతీష్, వినోద్, నవీన్, తిరుపతి, వేణు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల డ్యూటీ హాయి

కృష్ణ పుష్కరాల సందర్భంగా చంద్రబాబు రాష్ట్రంలో సగానికి పైగా యంత్రాంగాన్ని ఈ పన్నెండురోజులు పుష్కర ఘాట్ల వద్దే పెట్టారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌లలో అయితే ఒకరిద్దరు కానిస్టేబుళ్లు తప్ప మిగతా వాళ్లంతా పుష్కర విధులకు వెళ్లొచ్చారు. పుష్కరఘాట్ల వద్ద సిబ్బంది ఎక్కువగా ఉండడం, జనాల తాకిడి కూడా పెద్దగా లేకపోవడంతో అధికార యంత్రాంగానికి అక్కడ పెద్దగా పని లేకుండా పోయింది. ఇక్కడ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఒకరు అరా సిబ్బందికి మాత్రం తీరిక లేని పనితో చిరిగి చేటయ్యింది. చాలామంది ఏదో వంక చెప్పి పుష్కర విధులను తప్పించుకున్నారు. కాని ఇప్పుడు... ఇక్కడ పని ఒత్తిడి తట్టుకోలేక హాయిగా పుష్కరాల డ్యూటీకి పోయివున్నా బాగుండేదనుకున్నారు.

## పుష్కరాల నుండి తిరిగి విధుల్లోకి...

ఈనెల 23వ తేదీతో కృష్ణ పుష్కరాలు ముగియడంతో జిల్లా నుండి పుష్కర విధుల కోసం వెళ్లిన అధికార యంత్రాంగమంతా తిరిగి జిల్లాకు చేరుకుంది. కొంతమంది 23వ తేదీ రాత్రికే రాగా, ఇంకొందరు 24వ తేదీ చేరుకున్నారు. జిల్లా నుండి 1400మంది దాకా పోలీసు సిబ్బందితో పాటు వివిధ శాఖల నుండి భారీగా సిబ్బంది తరలివెళ్లారు. సిబ్బంది లేక ఈ 12రోజుల పాటు ప్రభుత్వ శాఖల్లో, పోలీసుస్టేషన్‌లలో పనులు అంతంత మాత్రమే జరిగాయి.

## ముగిసిన పెళ్లిళ్లు

శ్రావణ మాసం వివాహాలమయం. ఈ నెలలో పెళ్లిళ్లు భారీ సంఖ్యలోనే జరిగాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, విద్యుత్ దీపకాంతులతో ఈ నెలంతా కూడా నెల్లూరు నగరం ఎంతో కళగా కనిపించింది. ఈ నెల 30వ తేదీతో ముహూర్తాలు అయిపోతాయి. మళ్లీ కార్తీక మాసం దాకా వివాహాలు ఉండవు.

## మండే ఎండలు

మండే ఎండలకు జనాలు విలవిలాడుతున్నారు. నెల్లూరుజిల్లాలో ఉష్ణోగ్రతలు మండు వేసవిని తలపిస్తున్నాయి. నెల్లూరు నగరంతో పాటు పట్టణాల్లో సైతం 40డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు చేరాయి. కొన్ని మండలాల్లో పంటలకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి కూలీలపై ఇది ప్రభావం చూపుతోంది. జిల్లాలో 13ప్రాంతాల్లో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్, మే నెలల కంటే ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. ఎండల ధాటికి జనం మలమల మాడిపోతున్నారు.

## వంతెన మూత!

రంగనాయకులపేటలో గుడి దాటాక జాఫర్ సాహెబ్ కాలువపై ఉన్న వంతెనను మూసివేశారు. పెన్నా వారధి వద్దకు, తిక్కన పార్కుకు, పాత చెక్‌పోస్టు వద్దకు పోయే వాళ్లు ఇటే వెళ్తుండేవాళ్లు. గతంలో మినీబైపాస్ నిర్మాణంలో వున్నప్పుడు ఈ వంతెన మీదే భారీ వాహనాలు నడిచాయి. దాంతో వంతెన పాడై ప్రమాదకరంగా మారడంతో తాత్కాలికంగా మూసేసారు.

## మీ దందాలకు...

# డి.ఆర్.హోటలే సాక్షి

**- అజీజ్‌పై అనిల్ ధ్వజం**



నెల్లూరు మేయర్ అజీజ్, ఆయన తమ్ముడు జలీల్ దందాలకు డి.ఆర్ హోటలే ప్రధాన సాక్ష్యమని నెల్లూరు నగరఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తాడు. ఈ నెల 22వ తేదీన అంబాపురం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అజీజ్‌పై విరుచుకుపడ్డాడు. డి.ఆర్ హోటల్‌లో వున్న ఆరు నెలల సి.సి కెమెరా పుటేజీలపై విచారణ జరిపిస్తేనే భాగోతం బయటపడుతుందన్నారు. 54ఏళ్ల తర్వాత నెల్లూరు నగరంలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మైనార్టీలకు అవకాశం కల్పిస్తే, పవిత్ర రంజాన్ మాసం ముగియక ముందే ముస్లిం సోదరులను నయవంచనకు గురిచేసి అధికారం కోసం, అడ్డదారి సంపాదన కోసం తెలుగుదేశంలో చేరిన నీచ చరిత్ర అజీజ్‌దేనని అనిల్ ఘాటుగా విమర్శించాడు. అజీజ్ అవినీతి గురించి మేం లేవనెత్తితే కొందరు తెలుగుదేశం నాయకులకు రోషం పొడుచుకొచ్చి మాపై ఏదేదో మాట్లాడుతున్నారని, అలాంటి వారు అజీజ్ నీతిమంతుడని మూలాపేట శివాలయంకొచ్చి ప్రమాణం చేయాలని ఆయన సవాల్ విసిరాడు. కొత్తూరు, అంబాపురం వద్ద 11ఎకరాల మైనార్టీల భూమిని తాను ఆక్రమించుకున్నట్లు అజీజ్ ఆరోపించారని, నేను ఆ భూమిని ఆక్రమించుకున్నట్లు నిరూపిస్తే ఆ 11ఎకరాలతో పాటు నాకున్న 3ఎకరాల స్థలాన్ని కూడా మైనార్టీలకు రాసిస్తానన్నారు. రెండువర్గాల మధ్య జరిగిన గొడవల్లో ఆ భూమి వివాదం సుప్రీంకోర్టులో వుందే తప్ప దాంతో తనకు గాని, తన కుటుంబానికి గాని ఎటువంటి సంబంధం లేదని అనిల్ పేర్కొన్నాడు. రాజకీయాలలోకి వచ్చి నేను ఆస్తులు అమ్ముకున్నానే గాని, అజీజ్‌లాగా దోపిడీ చేయలేదన్నారు.

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారపార్టీలో వున్న మేయర్ చేసిన ఆరోపణలకు అనిల్ సమాధానాలు ఇచ్చారని, అజీజ్‌కు మాటపై నిలబడే తత్వం, నీతినిజాయితీ ఉంటే ఆ 11ఎకరాలు అనిల్‌కుమార్‌యాదవ్ ఆధీనంలో ఉందని నిరూపించగల సత్తా ఉందా అని ప్రశ్నించాడు. అజీజ్ తన రాజకీయ స్వలాభం కోసం రాజకీయ క్రీడల్లో యావత్ ముస్లిం సోదరులను లాగాలనుకుంటే వారు సహించరన్నారు. 50సంవత్సరాల తరువాత ముస్లిం సోదరులకు నెల్లూరు నగరంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అవకాశం ఇస్తే అధికార తెలుగుదేశం పార్టీ ఆనాడు నిన్ను మేయర్‌ను చేయకూడదని మాపై అనేక వత్తిళ్లకు, బెదిరింపులకు పాల్పడినా దేనికీ భయపడకుండా మేము, మా కార్పొరేటర్లు, మా నాయకులు, కార్యకర్తలు నీ కోసం నిలబడి నిన్ను మేయర్‌ను చేస్తే.... మాపై ఎందుకు నీకు అంత కక్ష అని ప్రశ్నించాడు. రూప్‌కుమార్‌యాదవ్‌ను అర్ధాయుష్కుడని అజీజ్ అనడం సరికాదని, మనిషి ఆయుష్షును నిర్ణయించేది ఆ భగవంతుడేనని అన్నారు. ఇప్పటికైనా అజీజ్‌కు దమ్ము ధైర్యం ఉంటే నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విసిరిన సవాల్‌కు సిద్ధమా అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌రాజ్ సంపూర్ణమ్మ, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, ఎండి. ఖలీల్‌అహ్మద్, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక భారత నిర్మాత రాజీవ్

**- పనబాక కృష్ణయ్య**



నవభారత నిర్మాణంలో మరువలేని పాత్ర పోషించిన చిరస్మరణీయ ప్రధాని రాజీవ్‌గాంధీ అని నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు డా॥ పనబాక కృష్ణయ్య పేర్కొన్నాడు. ఈ నెల 20వ తేదీ నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మాజీ భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 72వ జన్మదిన వేడుకలను నెల్లూరు కొండాయపాలెం గేటు సెంటర్ వద్దగల ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా డా॥ పనబాక కృష్ణయ్య, పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చెంచలబాబు యాదవ్, కాంగ్రెస్‌పార్టీ అన్ని అనుబంధ సంస్థల అధ్యక్షులు వారి బృందాలతో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ భారతదేశం, తెలుగు రాష్ట్రాలు సాఫ్ట్ వేర్ రంగం, ఇంటర్నెట్ ప్రపంచంలో ఇంత అవగాహన, ప్రగతి సాధించిందంటే కారణం ఆనాడు రాజీవ్‌గాంధీ వేసిన పునాది అని వివరించారు. నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టడం, గాట్ ఒప్పందంపై సంతకం చేయడం, ప్రపంచీకరణ ప్రక్రియకు దేశాన్ని ఉన్నతీకరణ చేయడం, ఓటు హక్కు వయస్సు పరిమితిని 21ఏళ్ల నుంచి 18ఏళ్లకు తగ్గించడం వంటి సాహసోపేతమైన చర్యలు రాజీవ్‌గాంధీ తానుగా చేసిన పనులని తెలియజేశారు. నేటితరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామపంచాయితీలకు నేరుగా నిధులు అందాలని పంచాయితీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీ దేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధానకార్యదర్శి చెంచలబాబుయాదవ్, డిసిసెల్ రాష్ట్ర కన్వీనర్ గాలాజు శివాచారి, ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ శీలం తిరుపతయ్య, పిసిసి కార్యదర్శి మల్లి నవీన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




స్వర్గీయ పెనుబల్లి జనార్ధన్‌రెడ్డి - నళినిల కుమారుడు **చాణుక్యరెడ్డి - సుస్మిత** (నెల్లూరు వాస్తవ్యులు ఏలూరు గోవర్ధన్‌రెడ్డి - సంధ్యల కుమార్తె)ల వివాహం ఆగస్టు 21వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.



విపిఆర్ మైనింగ్ సంస్థల్లో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి - రమాదేవిల కుమార్తె **మౌనిక-శివనాథ్‌రెడ్డి** (వింజమూరు వైసిపి నాయకులు నిమ్మకాయల కృష్ణారెడ్డి - సుశీలల కుమారుడు)ల కల్యాణం ఆగస్టు 18వ తేదీ వింజమూరులోని చెన్నకేశవస్వామి దేవస్థానం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



ఆడిటర్ ఆమంచర్ల శంకరనారాయణ - పద్మినిల కుమార్తె **సౌమ్య - రోహిత్** (ముంబై వాస్తవ్యులు ఐ.శ్రీనివాసరావు - శాంతిల కుమారుడు)ల పెళ్ళి ఆగస్టు 21వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



ముత్తుకూరు వాస్తవ్యులు దోర్నాదుల రాజగోపాల్‌రెడ్డి - శారదమ్మల కుమారుడు **పెంచల ప్రణీత్‌కుమార్‌రెడ్డి - అశ్విని**(నెల్లూరు వాస్తవ్యులు చిగిలి రమణారెడ్డి - నిర్మలల కుమార్తె)ల పరిణయం ఆగస్టు 10వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

### బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో
# టంగుటూరు జన్మదిన వేడుకలు

గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్ట మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి కీ॥శే॥ టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలు హనుమంతరావునగర్ గార్డెన్ హౌస్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. పై కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ ఆయన సేవలు రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా ఎంతో ఉపయోగపడ్డాయని, స్వాతంత్ర్య సమరయోధుడుగా తెలుగు వాడి కీర్తిప్రతిష్టలు దశదిశలా చాటారని, సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి తన గుండెలు చూపిస్తూ మమ్మలను కాల్చండిరా అని నిర్భయంగా మాట్లాడిన ఏకైక వ్యక్తి, నిరాడంబరుడు అని కొనియాడారు. ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ అతను మొట్ట మొదటిగా రాజమండ్రికి మున్సిపల్ ఛైర్మెన్‌గా రాజకీయ ప్రవేశం చేసి, తమిళనాడు, ఆంధ్ర ఉమ్మడి రాజధానికి మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారన్నారు. పేదలంటే ఆయనకు ప్రీతి అని కొనియాడారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



టంగుటూరుకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం

## ఐఐఐటికి వివేకానంద విద్యార్థి


లోకేష్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ చంద్రమోహన్

గూడూరు రెండవ పట్టణంలోని శ్రీ వివేకానంద హైస్కూల్‌లో 2015-16వ సంవత్సరం 10వ తరగతి చదివిన ఎన్.లోకేష్ ఇదుపులపాయలోని ఐఐఐటికి ఎంపికయ్యాడని ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.చంద్రమోహన్ పేర్కొన్నాడు. ఆ విద్యార్థి 10వ తరగతిలో 9.8 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాడన్నారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు తమ పాఠశాలలోనే లోకేష్ చదివాడని, తమ పాఠశాల ఉపాధ్యాయబృందం సాధనతోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించాడని, అతనిని పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందం అభినందించారన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### సిరామిక్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల
# గ్రీన్ రన్



గ్రీన్‌రన్ నిర్వహిస్తున్న సిరామిక్ కళాశాల విద్యార్థులు


మొక్కల పెంపకం, వాటి ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పట్టణంలోని సిరామిక్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు మంగళవారం గ్రీన్‌రన్ నిర్వహించారు. తొలుత గూడూరు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.విజయకుమార్ దీనిని ప్రారంభించారు. ఆ ఇన్‌స్టిట్యూట్ వద్ద నుంచి పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిరామిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డిపార్టుమెంటు హెడ్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన


ఆర్డీవో వెంకటసుబ్బయ్యతో మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ బాధితులు

తమకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితులు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమను ఆదుకోవాలని ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం తీరుతో వేలాదిమంది బాధితులు నష్టపోయారని, కొందరు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వాసు గౌడ్, మూర్తి, మునికృష్ణయ్య, రవిచంద్ర తదితరులు ఉన్నారు. గూడూరు డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల అర్జీలు ఆర్డీవోకు ఇచ్చి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

## అది "వ్యాస" మహాభారతం!
# ఇది "శేష" మహాభారతం




శేషేంద్ర శర్మ
**ఆధునిక మహాభారతం**
పేజీలు - 400 వెల - రూ.400/-
ప్రతులకు:
నవ తెలంగాణ, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు
మన తెలంగాణ, ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్



సమీక్షకులు
**'పద్మశ్రీ' తుర్లపాటి కుటుంబరావు**
విజయవాడ. 9848317533

తెలుగు అక్షరాలు తెలిసినవారందరికీ గుంటూరు శేషేంద్రశర్మ పేరు గుండెల్లో కొట్టుకుంటూనే వుంటుంది!

ఆయన పుట్టింది నెల్లూరు జిల్లాలో చిన్న పల్లెలో. చదివింది "లా" అయినా "లాయర్" కాలేదు. చేసింది మూడు దశాబ్దాలకు పైగా మునిసిపల్ కమిషనర్‌గా. ఎన్నో "బాధల బస్తీ"లలో నివాసం. అయినా, "గుండెలతోనే ఆయన దోస్తీ"!..

ఈ పరిచయ వాక్యాలలో "ఇన్వర్టెడ్ కామాల" మధ్య యిరుక్కున్న పదాలు శేషేంద్రశర్మ తన "ఆధునిక మహాభారతం"లో సృష్టించిన అద్భుత, అపురూప అక్షర లక్షలే!

"బాధల బస్తీ",
"అయినా నాకు గుండెలతోనే దోస్తీ"
-- ఏమా, పదాలు "శేషేంద్రజాలం!"

నాల్గవ ముద్రణకు నోచుకుని, మరెన్ని ముద్రణలు వెలుగుచూస్తాయోనన్న ఉత్సుకత కలిగించే శర్మగారి "ఆధునిక మహాభారతం" ఆయన అసంఖ్యాక వచన కవితల సమాహారం!

1970-84 సంవత్సరాల మధ్య వెలువడిన ఆయన కవితా సంకలనాలను పర్వాలుగా పేర్కొంటూ ఈ "ఆధునిక మహాభారతం"గా వెలువరించారు. ఇందులో ప్రతి పదం ఒక "శేష ప్రశ్నే". అది ఆయన తనకు తాను వేసుకునే "శేష ప్రశ్న". సమాజంపై సంధించే సశేష ప్రశ్న!

"నేను చెమట బిందువుని
కండల కొండల్లో ఉదయించే
లోకబంధువుని
గుండెలతో నాకు దోస్తీ
నేనుండేది బాధల బస్తీ"--

శేషేంద్రుడు ప్రపంచ కవితా చక్రవర్తి. అటు పాశ్చాత్య సాహితిని, ఇటు ప్రాచ్య సాహిత్యాన్ని ఆయన పుక్కిట పట్టారు. ఇదంతా ఆయన ఎన్నో "బాధల బస్తీ"లకు పరిపాలకుడుగా వుంటూ!.. బహుశా "బాధల బస్తీ"లలో కాపురం చేయడం వల్లనే ఆయనకు "కలియుగ మహాభారతం" దృగ్గోచరమైందేమో!

బాధార్తులు నిత్య నిరాశోపహతులు. వారి బాధ, నిరాశా పరితప్త హృదయాలలో ఆశారేఖలను "ఇంజెక్టు" చేస్తూ--

"రేపు నీదే పద!
ఉదయించెనదే నవలోకం
ఆరిపోనీకు సఖా
గుండెలో ఆశాదీపం
ఓడిపోయానని చింతించకు
పద్మవ్యూహం
జీవితం కాదిది అడుగడుగున
ఒక పోరాటం
రాలనీకోకుమ నీ కన్నులలో ముత్యాలు
మోయలేదీ భువి ఆ రగిలే సముద్రాలు
నీవు నీ పిల్లలు తోటల్లో విహరిస్తారు
కోలుపోయిన నవ్వు తిరిగి సాధిస్తారు!"...

ఏమా నవలోక శంఖారావం! నిరాశోపహతులకు నవ జీవన సందేశం!

ఒకటా, రెండా?...దాదాపు నాలుగు వందల పేజీల నిండా శేషకవీంద్ర సందేశాలతో విలసిల్లే ఈ "ఆధునిక మహాభారతం" ప్రతి అక్షరజీవి కర కమలాలలో, హృదయాలలో నిక్షిప్తం చేసుకోదగిన మహత్తర కవితాంజలి!

అలనాడు ద్వాపర యుగంలో వెలసింది "వ్యాస మహాభారతం", ఈనాడు కలియుగంలో ఆవిర్భవించింది ఈ "శేష మహాభారతం"!

అయితే, ఒక శేష ప్రశ్న!

ఇంతటి సాహిత్య సమ్రాట్టుకు ఒక ఉన్నత "పద్మ అవార్డు", ఒక "జ్ఞాన పీఠాధిపత్యం" ఎందుకు దూరమైనాయన్నది అస్మదాదులకు మరో "శేష ప్రశ్న"?

అది కోటి డాలర్ల ప్రశ్న!?...

### బిసి సెల్ కార్యదర్శిగా
## పుట్టయ్యగౌడ్


కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న పుట్టయ్యగౌడ్

జిల్లా కాంగ్రెస్‌పార్టీ బిసి సెల్ కార్యదర్శిగా గూడూరు ప్రాంతానికి చెందిన పుట్టయ్యగౌడ్‌ను డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆదివారం నియమించారు. ఈ క్రమంలోనే ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. బీసీలను సమన్వయపరచి కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు మండలం, తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఈ నెల 21న ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కోపూరు జనార్ధన్‌రెడ్డి తగు ఏర్పాట్లు చేశారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 26.8.2016 నుండి**
**తేది. 1.9.2016 వరకు**

ఈ వారము వృషభ, మిథున, కర్కాటక, సింహంలో చంద్రుడు, సింహంలో రవి రాహువులు, కన్యలో బుధ గురువు శుక్రుడు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 27 శనివారము ఉదయము 6.30 నుండి గంట 8.30 లోగా కన్యా లగ్నమున శంకుస్థాపన, వివాహములు.

**శ్రావణ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | నవమి | రా॥ గం.8.30వ॥ |
| తేది. 27 | శని | దశమి | రా॥ గం.6.36వ॥ |
| తేది. 28 | ఆది | ఏకాదశి | సా॥ గం.4.40వ॥ |
| తేది. 29 | సోమ | ద్వాదశి | సా॥ గం.3.16వ॥ |
| తేది. 30 | మంగళ | త్రయోదశి | ప॥ గం.2.58వ॥ |
| తేది. 31 | బుధ | చతుర్ధశి | ప॥ గం.1.46వ॥ |
| తేది. 1 | గురు | అమావాస్య | ప॥ గం.1.46వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బిడ్డలకు శుభకార్య నిర్ణయాలు జరగడం, ఉద్యోగ వృద్ధి ఉంటుంది. పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. మీది కాని విషయాలకు దూరంగా ఉండండి. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. పనులు నిదానంగా జరుగుతున్నా సానుకూలం కాగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అనుకున్న పనులు నిదానంగా సవ్యంగా జరుగుతాయి. వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. అన్ని విషయాలలోనూ టెన్షన్ ఎక్కువగానుంటుంది. ఆరోగ్యం జాగ్రత్త. ఆర్థికంగా ఇబ్బంది దినాలివి. వృత్తి వ్యాపారాలు చేసేవారికి సంతృప్తి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులు తప్పవు. మీపై విమర్శలు చేసే వారుంటారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త వస్తువులు సమకూర్చుకొనడం, ప్రముఖులను బంధువర్గాన్ని కలుసుకొనడం, శుభకార్యాలను నిర్ణయం చేయడం జరుగుతుంది. దూర ప్రయాణాలుంటాయి. కొత్త వ్యాపార, పరిశ్రమల ప్రారంభం, షేర్లు పెట్టుబడుల పై లాభాలు లభిస్తాయి. పెండింగ్ వ్యవహారాలు పరిష్కారం కావడం జరుగుతుంది. వ్యాపార పరంగా అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులు తమ పైఅధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. కొత్త వస్తువులు సమకూరుతాయి. సామాజిక కార్యక్రమాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. వాణిజ్య అగ్రిమెంట్లు, వ్యాపార భాగస్వామ్యాలకు ప్రయత్నించండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య ప్రయత్నాలు ఫలించవచ్చును. రావలసిన బాకీలు లభించడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. వర్కర్లతో యజమానులు జాగ్రత్తపడాలి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కళా క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి మంచి అవకాశాలు దొరకగలవు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరం. వృత్తి వ్యాపారాలవృద్ధికి విశేష కృషి చేస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. శుభకార్యాలకు సమాయత్తం కాగలరు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం, అధికారులకు స్థానమార్పులుంటాయి. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది. సభలు సమావేశాలకు ఆహ్వానాలు లభిస్తాయి. స్థిరాస్తులు కొనడం, కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలు, వ్యాపార విస్తరణలకు అనుకూల సమయం.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబంలో చిన్న విభేదాలుండి సర్దుకొంటాయి. బిడ్డలకు విద్యావృద్ధి ఉద్యోగావకాశాలు దొరుకుతాయి. వస్తు వాహన రిపేర్లుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలుంటాయి. వ్యాపార రంగాలలో అభివృద్ధి అవకాశాలు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రైవేటు ఉద్యోగులకు పని భారం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు లభిస్తాయి. ఆరోగ్యం కొద్దిగా ఇబ్బంది పెడుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడవచ్చును. అనుకోని సమస్యలు ఎదురుకావచ్చును. ప్రయాణాలలో శ్రమపడతారు. విద్యాప్రగతి బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. అవసరాలకు ఋణం చేయక తప్పదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. బంధుమిత్రులను ప్రముఖులను కలుసుకొంటారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఆరోగ్యం మాత్రం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది. పొదుపు పథకాలు చేపడతారు. సేవా, సాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు గుర్తింపు, గౌరవాలు, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. నూతన వస్తువులు సమకూర్చుకొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు ప్రయత్నిస్తే పొందగలరు. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. సామాజిక దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. షేర్లు లాభాలనివ్వగలవు. కొత్త కాంట్రాక్టులు లీజులకు ప్రయత్నించండి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి లేకపోయినా సామాన్య ఆదాయం లోపం ఉండదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పొదుపు పథకాలు చేపట్టడం, కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. సేవా సాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చెల్లింపులు సకాలంలో చేస్తారు. వృత్తి ఉద్యోగ బాధ్యతలలో ఆటంకాలు తొలగిపోతాయి. ఆస్తి వివాదాలు పరిష్కారం కావడం, కోర్టు వ్యవహారాలందు అనుకూలత బాగుంటుంది. స్థిరాస్తులు, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వస్తు వాహన రిపేర్లుంటాయి. పిల్లలకు విద్యా, ఆరోగ్యవృద్ధి బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. కొన్ని అనవసర ఖర్చులుంటాయి. కొత్త ఋణాలు దొరకడం, ప్రభుత్వ అనుమతులు దొరకడం జరుగుతుంది. విద్యార్థులు మరింత కష్టపడాలి. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. అందుచే టెన్షన్ పడతారు. శరీరానికి గాయాలు తగలవచ్చును.

# సింధు విజయంలో నెల్లూరు పాత్ర

శ్రీను గల్పిక

అది తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం. అక్కడంతా కోలాహలంగా వుంది. ఏపి సిఎం చంద్రబాబు, తెలంగాణ సిఎం కేసీఆర్‌లతో పాటు ఇరు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధ క్రీడా సంఘాల అధిపతులు ఉన్నారు. వారంతా చేతుల్లో పూలబొకేలతో ఒలంపిక్స్ రజత పతక విజేత సింధుకు స్వాగతం పలకడానికి ఎదురుచూస్తున్నారు. ఈలోపుగా ఖాళీగా ఉండడం ఇష్టంలేని టీవీ 10.5 విలేకరి ఎయిర్‌న్యూస్ వెంకట్రావ్... చంద్రబాబు నోటి వద్ద మైక్ పెట్టి... సార్, సింధు విజయం పట్ల మీరు ఎలా ఫీలవుతున్నారని ప్రశ్నించాడు. ఇట్లాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న చంద్రబాబు వెంటనే స్పందించి... సింధు పతకం గెలవడానికి కారణం నేనే... అని చెబుతుండగా ఎయిర్ న్యూస్ వెంకట్రావ్ మధ్యలో కలుగజేసుకుని... అదేంటి ఆమె కోచ్ పుల్లెల గోపీచంద్ కదా, మీరు కనీసం బ్యాట్ పట్టుకోవడం కూడా నేనెప్పుడూ చూడలేదే అని ఆశ్చర్యంగా అడిగాడు. ఒకరు పతకం గెలవాలంటే ఆట నేర్పించడమే ముఖ్యం కాదు, ఆ ఆట నేర్చుకోవడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ముఖ్యం. పుల్లెల గోపీచంద్‌కు బాల్‌బ్యాడ్మింటన్ అకాడమీ పెట్టుకోవడానికి స్థలమిచ్చింది నేనే, అంతెందుకు సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ సిఇఓ కావడానికి, సుందర్ పిచాయ్ గూగూల్ సిఇఓ కావడానికి, ఏపిలో సెల్‌ఫోన్‌లు రావడానికి... ఇలా అన్నింటికి కారణం నేనే... అంతెందుకు ఆంధ్రప్రదేశ్ విడిపోవడానికి, కేసీఆర్ తెలంగాణ సీఎం కావడానికి కూడా కారణం నేనే అని చెప్పాడు. పక్కనే వుండి ఆ మాట విన్న కేసీఆర్ ఆగ్రహంతో... అసలు నిన్ను ఇక్కడి దాకా ఎవరు రానించారు, నువ్వెళ్లి విజయవాడలో ఉండక ఇక్కడ నీకేం పని, నేను సీఎం కావడంలో నీ పాత్ర ఏమిటి? నేను తెలంగాణ కోసం పోరాడి సీఎంనైనానన్నాడు. అందుకు చంద్రబాబు... ఆ మాటంటే నేనొప్పుకోను... 1999లో నేను మంత్రి పదవి ఇచ్చుంటే నువ్వు తెలుగుదేశం నుండి వెళ్లేవాడివా, టిఆర్ఎస్ పెట్టేవాడివా, ఉద్యమాలు చేసేవాడివా? తెలంగాణ వచ్చేదా? సీఎం అయ్యేవాడివా? అని వాస్తవాలు అడిగాడు. వెంటనే కేసీఆర్ పక్కనే వున్న మంత్రి నాయని నర్సింహారెడ్డితో... ఆ ఓటు - నోటు కేసు ఏమైందో ఒకసారి చూడు అని గట్టిగా అరిచాడు. దాంతో చంద్రబాబు... అయిపోయిన పెళ్లికి ఇప్పుడు మేళం ఎందుకులే, నేను నీ గురించి పట్టించుకోను, నువ్వు నా గురించి పట్టించుకోవద్దు అని ప్రపోజ్ చేశాడు. అంతలో సింధు, గోపీచంద్‌లు విమానం దిగి బయటకు రావడంతో మీడియా వాళ్లు వీళ్ల చేతుల్లో మైకులు పెరుక్కుని వాళ్ల వద్దకు పరుగులు తీశారు.

స్వాగత కార్యక్రమాలయ్యాక సింధు ఓపెన్ టాప్ లారీపై వూరేగుతూ గచ్చిబౌలి స్టేడియంకు చేరుకుంది. దారి పొడవునా అభిమానులు ఆమెకు నీరాజనాలు పట్టారు. గచ్చిబౌలి స్టేడియంలో సింధుకు సన్మాన సభ. కేసీఆర్, చంద్రబాబులతో పాటు మంత్రులు, క్రీడా సంఘాల వాళ్లు సింధును ఘనంగా సత్కరించి బహుమతులందించారు. చంద్రబాబు అయితే తన ప్రసంగంలో సింధుకు పతకం రావడానికి తానే కారణమని చెబితే, కేసీఆర్ మాత్రం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించబట్టే సింధుకు పతకం వచ్చిందని చెప్పాడు. తనకు జరిగిన అభినందన సత్కారానికి కృతజ్ఞతలు తెలపడానికి సింధు లేచి మైకు ముందుకొచ్చింది. తనను వెన్ను తట్టి ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపింది. గురువు గోపీచంద్ తన పాలిట దైవసమానుడిగా పేర్కొంది. ఒలింపిక్స్‌లో తన అనుభవాలను పంచుకుంటూ... నేను ఈ పతకం నెగ్గడం వెనుక ఒక అద్భుత శక్తి కృషి వుంది.. ఆ శక్తి ఎవరంటే..? అని పది సెకెండ్లు ఆపింది. ఆ సమయంలో చంద్రబాబు, కేసీఆర్, గోపిచంద్‌లు... ఎవరికి వాళ్లు సింధు నా పేరే చెప్పబోతోంది, నా కీర్తి విశ్వవ్యాప్తం కాబోతుంది... అనే ఆలోచనల్లో వుండిపోయారు.. అప్పుడే ఆ టెన్షన్‌కు తెరదించుతూ సింధూ... ఆ అద్భుత శక్తి ఎవరో కాదు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు అని చెప్పింది. అంతే, స్టేడియం మొత్తం ఒక్కసారిగా నిశ్శబ్దం... ఒకరివైపు ఒకరు బిత్తర చూపులు. ఈ హఠాత్పరిణామానికి అందరూ షాక్ అయ్యారు. కొద్దిసేపటికి మంత్రి నాయని నర్సింహారెడ్డి తేరుకుని... అదేంటమ్మాయ్, అలా అంటావ్. నువ్వు పుట్టి పెరిగింది హైదరాబాద్‌లో, నువ్వు ఆట నేర్చుకున్న గోపీచంద్ అకాడమీ ఉండేది తెలంగాణలో... నిన్ను ఒలింపిక్స్‌కు పంపింది భారత ప్రభుత్వం ఖర్చుతో... మరి క్రెడిట్ మాత్రం నెల్లూరు దోమలకా? అని ప్రశ్నించాడు. అప్పుడు సింధు... అపార్థం చేసుకోకండి... నా ఆట వెనుక మీరంతా వున్నారు. కాని ఆ ఆటలో గెలుపు వెనుక ఉన్నది మాత్రం నెల్లూరు దోమలే... అదెలాగో చూపిస్తాను చూడండి అంటూ అప్పటికప్పుడు ఒక ఎల్‌సిడి ప్రొజెక్టర్ ఏర్పాటు చేయించి, ఒక సిడి ఆన్ చేసింది. స్క్రీన్ మీద సీన్‌లు రాసాగాయి.

★ ★ ★ ★ ★

అది 2010 సంవత్సరం. నెల్లూరు ఏ.సి. స్టేడియంలో జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ అండర్-15 పోటీలు జరుగుతున్నాయి. ఆ పోటీలకు సింధు కూడా హాజరైంది. పగలు వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులతో ఆడిన సింధు రాత్రి విశ్రాంతి తీసుకునేందుకు తన రూమ్‌కు వెళ్తుండగా ఆమె తండ్రి రమణకు మిత్రుడు, అప్పుడు ఎస్ఐగా వున్న బి.శ్రీనివాసరెడ్డి వచ్చి ఆమె చేతికి ఇంకో బ్యాట్ ఇచ్చాడు. సింధు వుండి... ఏంటంకుల్ ఈ బ్యాట్, నా వద్ద వుంది కదా అంది. అందుకు శ్రీనివాసరెడ్డి... అది ప్రత్యర్థులతో ఆడుకోడానికమ్మా... ఇది నీ రూమ్‌లో వుండే రాకాసి దోమలతో ఆడుకోవడానికి... ఇది మస్కిటో బ్యాట్... రాత్రి మేల్కొని వాటిని చంపుకుంటూ వుండూ... అదే నీకు పెద్ద ట్రైనింగ్ అని చెప్పి వెళ్లిపోయాడు. తన రూమ్‌కు వెళ్లాక శ్రీనివాసరెడ్డి అంకుల్ తనకు మస్కిటో బ్యాట్ ఎందుకిచ్చాడో సింధుకు అర్ధమైంది. రాత్రంతా ఆ బ్యాట్‌ను అటూ ఇటూ వూపుతూ ఒక్క దోమను కూడా మిగల్చకుండా చంపేసింది. పక్కరోజు టోర్నమెంట్‌లో గేమ్ ఆడేటప్పుడు కూడా దోమలను చంపుతున్న టెక్నిక్‌తోనే ఆడింది. అదే టెక్నిక్‌తో ఆ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. ఆ తర్వాత అదే టెక్నిక్‌తో అప్రతిహంగా రాణించసాగింది. అక్కడితో సి.డి అయిపోయింది. తర్వాత సింధునే మైక్ తీసుకుని... ఒలింపిక్స్‌లో కూడా నెల్లూరు ముదురుదోమలను గుర్తుచేసుకుంటూ అదే టెక్నిక్‌తో ఆడాను. అందుకే ఫైనల్ దాకా వెళ్లాను. స్పెయిన్‌లో నెల్లూరు దోమలను మించిన దోమలున్నట్లున్నాయి. ఫైనల్స్‌లో కరోలినా మారిన్ అదే టెక్నిక్‌తో నాకంటే వేగంగా ఆడి గెలిచింది. అయినా ఈ గెలుపు నెల్లూరు దోమలవల్లే అని చెప్పింది. అప్పుడు వెంటనే చంద్రబాబు లేచి... నెల్లూరు మా ఏపిలోదే! అక్కడ దోమలు అంతగా అభివృద్ధి చెందడానికి కారణం మా ప్రభుత్వం, మా పార్టీ పాలకులే... కాబట్టి సింధుకు పతకం రావడం వెనుక నా కృషి లేదంటారా తమ్ముళ్లు అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు ఎవరి నోటా మాట రాలేదు.

# భక్తజన సంద్రంగా.. గొలగమూడి

## వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు




గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి 34వ ఆరాధన మహోత్సవాలకు భక్తజనం పోటెత్తారు. ఈ నెల 18 నుంచి 24 దాకా జరిగిన ఈ ఉత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఓం నారాయణ-ఆదినారాయణ మంత్రజపంతో, స్వామివారి నామస్మరణలతో ఆలయం మార్మోగింది. చివరి రోజైన ఆరాధన ఒక్కరోజే సుమారు లక్షకు పైగా జనం వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగానే కాక తమిళనాడు, కర్నాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భక్తజనులు ఒక ప్రవాహంలా తరలి వచ్చారు. దీంతో గొలగమూడి భక్తజనసంద్రంగా కనిపిం చింది.స్వామి దర్శనానికి సుమారు రెండు కిలోమీటర్ల మేర భక్తులు క్యూలలో బారులు తీరారు. ఈ ఆరాధనోత్సవానికి బుధవారం రాత్రి జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ కుటుంబసభ్యులతో విచ్చేసి ఆలయాన్ని సందర్శించి, తెప్పోత్సవంలో కొలువై వున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిని దర్శించుకున్నారు. ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం వైభవోపేతంగా జరిగాయి. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని వెంకయ్యస్వామిని దర్శించుకున్నారు.జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో వీరిని స్వాగతించారు.

**కాకాణిచే పట్టువస్త్రాల సమర్పణ :**

ఈ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు వెంకయ్యస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకాణి మాట్లాడుతూ, గొలగమూడి లోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆశ్రమం దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఆశ్రమ నిర్వాహకులు సమకూరుస్తున్నారని ప్రశంసించారు. వెంకయ్యస్వామి ఆశ్రమం అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నేతలు జడ్పీటిసి సభ్యుడు మందల వెంకటశేషయ్య, నాయకులు కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, కనుపూరు కోదండరామిరెడ్డి, పెళ్ళూరు సుధాకర్‌రెడ్డి, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, దాసరి భాస్కర గౌడ్, పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, బుధ వారంనాటి ఆరాధనోత్సవంలో టిడిపి నేత, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆశ్రమం అభివృద్ధికి ఆశ్రమ ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం అహర్ని శలు శ్రమిస్తున్నారని, ఇ.ఓ కృషి వల్లనే ఆశ్రమం ఇంతగా అభివృద్ధి సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు కుంకాల నాగేంద్రప్రసాద్, అనికేపల్లి సర్పంచ్ గుమ్మడి రాజాయాదవ్, నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాకాల శ్రీనివాసులు, నలగట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. రథోత్సవానికి పచ్చా శ్రీహరినాయుడు దంపతులు, తెప్పోత్సవానికి స్వర్గీయ స్వర్ణా వెంకటరామిరెడ్డి మిత్రబృందం ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమం ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆరాధనోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.

# గూడూరులో కృష్ణాష్టమి సంబరాలు



గూడూరు పట్టణంలో మయూరి శ్యాంయాదవ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వనజాకృష్ణ కళ్యాణ మండపంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు జిల్లా టిడిపి అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. కాగా, గూడూరు పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యాన కృష్ణాష్టమి పురస్కరించుకుని బుధ వారం శోభాయాత్రను వైభవంగా నిర్వ హించారు. గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పురపాలక ఛైర్మెన్ పొనకా దేవసేన మాట్లాడుతూ సంప్రదా యాలను నేటి తరానికి తెలియజేసేందుకు విహెచ్‌పి చూపుతున్న చొరవ అభినంద నీయమన్నారు. వారి చేతుల మీదుగా గెలు పొందిన విజేతలకు బహుమతులందజే శారు. శోభాయాత్రను పరిషత్ జిల్లా అధ్య క్షుడు మల్లెమాల మురళీరెడ్డి ప్రారంభిం చారు. కార్యక్రమంలో మురళీనాయుడు, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## గుఱ్రాల రమణయ్యకు రావూరి భరద్వాజ పురస్కారం

ప్రముఖ కవి గుఱ్రాల రమణయ్యకు వయోధికుల దినోత్సవ వేడుకల సందర్భంగా అక్టోబర్ 1న శ్రీ త్యాగరాయ గాన సభలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ రావూరి భరద్వాజ సజీవ ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్నట్లు జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గుదిబండ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారంతో బాటు నగదు బహుమతి రూ.2,500లు అందజేస్తామని తెలిపారు.



కృష్ణా పుష్కరాల సందర్భంగా గుంటూరుజిల్లా సత్రశాల వద్ద మొక్కలు నాటుతున్న నెల్లూరు వేణుగోపాల స్వామి దేవస్థానం ఉద్యోగులు రంగరాజు, కృష్ణ

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# తుస్స్విస్... ఛాలెంజ్

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలకు ఈ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడానికి ప్రభుత్వం ఈ విధానాన్ని అనుసరించింది. ప్రభుత్వానికి సింగపూర్ కంపెనీకి మధ్య ఒప్పందాలేమిటో కూడా వెల్లడి కాలేదు. సింగపూర్ కంపెనీ విధించిన షరతులన్నింటికి కూడా ప్రభుత్వం తలొగ్గింది. ప్రభుత్వమే మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఒప్పందం కుదిరింది. ఇక్కడ భూమి రైతులది, వేల కోట్లలో మౌలిక వసతులు కల్పించేది ప్రభుత్వ వ్యయంతో! వేల కోట్ల లాభాలు మాత్రం సింగపూర్ కంపెనీకి! స్విస్ ఛాలెంజ్‌ను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. స్విస్ ఛాలెంజ్ విధానాన్ని హైకోర్టు కూడా సీరియస్‌గానే ప్రశ్నించింది. స్విస్ ఛాలెంజ్‌లో పూర్తి వివరాలు బహిర్గతం కాలేదని, దీనికన్నా సీల్డు టెండర్లే మేలని హైకోర్టు అభిప్రాయపడింది. సింగపూర్ కన్సార్టియంకు రాజధాని నిర్మాణం అప్పగించ డానికి అన్ని విధాలా సిద్ధపడ్డ చంద్రబాబు, భారతీయ కంపెనీలు దానికి పోటీగా రాకుండా ఉండటం కోసం విచిత్రమైన నిబంధనలు పెట్టాడు. రాజధాని నిర్మాణానికి ఇక్కడి కంపెనీలు స్వదేశంలో కట్టిన నిర్మాణాల అనుభవం పనికిరాదని ఫిటింగ్ పెట్టాడు. విదేశీ కంపెనీలకు మాత్రం అంటే సింగపూర్ కన్సార్టియంకు మాత్రం అది వర్తించదు. టెండర్ నిబంధనలన్నింటిని కూడా సింగపూర్ కన్సార్టియంకు అనుకూలంగా ఉండేలా రూపొందించిన ప్రభుత్వం, స్విస్ ఛాలెంజ్ నుండి స్వదేశీ కంపెనీలను తప్పించేందుకు వాటికి అర్హత లేని నిబంధనలను పొందుపరచి టెండర్ ప్రక్రియను నడిపింది.

రాజధాని నిర్మాణం తన సొంత వ్యవహారంలా చంద్రబాబు నడిపిస్తున్నాడు. హైకోర్టు స్విస్‌ఛాలెంజ్ విధానంలో లోగుట్టును గట్టిగానే ప్రశ్నించింది. అయితే గుడ్డెద్దు చేలో పడినట్లున్న ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు చలనం కలిగిస్తాయా?

# తెలుగమ్మాయి!

(మొదటి పేజీ తరువాయి)

జనాభాలో ప్రపంచంలోనే రెండో పెద్ద దేశం. ప్రజాస్వామ్యంలో అగ్ర దేశం. ప్రపంచానికే నాగరికత నేర్పిన దేశం భారతదేశంకు ఒలింపిక్స్‌లో పతకాలే లేవా అని క్రీడాభిమానులు చింతిస్తున్న తరుణంలో బ్యాడ్మింటన్‌లో భారత్‌కు రజత పతకం అందించి భారత దేశాన్ని పతకాల పట్టికలోకి ఎక్కించిన ఆణిముత్యం అచ్చతెలుగు అమ్మాయి సింధు. రియో ఒలింపిక్స్ వెలుగుల్లో విరబూసిన తెలుగు సింధూరపువ్వు సింధు. రియో ఒలింపిక్స్‌కు వెళ్లే ముందు సింధుపై పెద్దగా అంచనాలు లేవు. కాని ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో అప్రతిహంగా దూసుకుపోయింది. తనకంటే మెరుగైన ర్యాంకింగ్ వున్న క్రీడాకారిణులను మట్టి కరిపిస్తూ ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. ఫైనల్స్‌లో స్పెయిన్‌కు చెందిన నెంబర్ వన్ ర్యాంకర్ కరోలినా మారిన్‌తో తలపడింది. మారిన్‌తో ఆట సయ్యాటే! ఇటీవల అన్ని టోర్నమెంట్స్‌లోనూ మారిన్ అసాధారణ ప్రతిభతో విజేతగా నిలుస్తోంది. అలాంటి మారిన్‌కే సింధు ముచ్చెమటలు పట్టించింది. మొదటి సెట్‌లో సింధుదే గెలుపు. రెండో సెట్ నుండి మారిన్ అలర్ట్ అయ్యింది. అటాకింగ్ గేమ్‌తో సింధుపై మిగిలిన రెండు సెట్‌లు కొట్టేసింది. ఫైనల్స్‌లో సింధు ఓడిపోయినప్పటికీ గెలవాలన్న ఆమె పోరాట స్ఫూర్తికి క్రీడాభిమానులందరూ జేజేలు పలికారు. ఓటమి తర్వాత కూడా అసహనం ప్రదర్శించకుండా ఆమె చూపిన క్రీడాస్ఫూర్తి, విజేత మారిన్‌ను అభినందించిన తీరు అందరి హృదయాలను గెలుచుకుంది.

**గోపీచంద్ చెక్కిన వజ్రం:** సింధు రజత పతకం విజయం వెనుక ముగ్గురు వ్యక్తులున్నారు. మొదటి ఇద్దరు ఆమెను బ్యాడ్మింటన్‌లో ప్రోత్సహించిన తల్లిదండ్రులు పి.వి.రమణ, విజయలక్ష్మిలు. ఇద్దరు కూడా వాలీబాల్ ప్లేయర్సే! బిడ్డలోని క్రీడాసక్తిని గమనించి వారు ఆమెను ప్రోత్సహించారు. తల్లిదండ్రులు కాబట్టి తమ బిడ్డ రాణించాలని కోరుకోవడం సహజం. అసలు కారకుడు మాత్రం పుల్లెల గోపీచంద్. బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం అకాడమీని స్థాపించిన గోపీచంద్ అక్కడ నుండే ఎంతోమంది క్రీడాకారులను తయారు చేశాడు. సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారిణి తనను అవమానించి వెళ్లినా లెక్క చేయకుండా శిక్షణ మీదే దృష్టి నిలిపాడు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే ప్లేయర్స్‌ను సృష్టించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. రియో ఒలింపిక్స్‌లో శ్రీకాంత్ పతకానికి కూతవేటు దూరంలో ఆగిపోయినప్పటికీ, సింధు మాత్రం ఆ లక్ష్యాన్ని ఛేదించి, తన గురువుకు రజత పతకాన్ని, దేశానికి కీర్తి పతాకాన్ని అందజేసింది. శెభాష్ సింధు...!

# ప్రశ్నించలేవా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారాజ్యం కోసం పని చేశాడు. అన్న కోసం ఆ మాత్రం చేయడం ధర్మం కూడా! 2014ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం కూటమికి అనుకూలంగా ప్రచారం చేశాడు. ఏపిలో తెలుగుదేశం గెలుపులో పవన్ పాత్ర చాలా కీలకంగా పనిచేసింది. ఆరోజు ప్రజలకిచ్చిన హామీలను విస్మరిస్తే కేంద్రాన్నైనా, రాష్ట్ర ప్రభుత్వాన్నైనా ప్రశ్నిస్తానని పవన్ ప్రతిచోటా చెప్పాడు. బీజేపీ, టీడీపీలు రెండూ కూడా తమ హామీలను యధేచ్ఛగా విస్మరిస్తున్నాయి. రాష్ట్రంలో అయితే చంద్రబాబు హామీలు గాలికి కొట్టుకుపోయాయి. ఋణ మాఫీ మొదలుకొని, రాజధాని నిర్మాణంకు వ్యవసాయ భూముల వినియోగం, ప్రాజెక్టులు, పుష్కరాల పేరుతో నిలువుదోపిడీ... ఇవన్నీ కళ్లకు కనిపిస్తున్న అక్రమాలే! మరి వీటిని పవన్ ప్రశ్నించకుండా వదిలేసాడేమని అభిమానుల ఆవేదన. అంతెందుకు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వలేమని కేంద్రంలోని బీజేపీ చేతులెత్తేసింది. ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా గురించే పవన్ ఎక్కువగా మాట్లాడారు. ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ మీద నమ్మకంతో ఆ పార్టీకి ప్రచారం చేశారు. మరి ఆ నమ్మకం వమ్మయ్యింది. ఏపికి కేంద్రం టోపీ పెట్టింది. మాట తప్పితే కేంద్రాన్ని నిలదీస్తానన్న పవన్ ఈరోజు ప్రశ్నించలేకపోతున్నాడు. అంతేకాదు కేంద్రంతో పోరాడే శక్తి తనకు లేదని, ఎంపీలే ఆ పని చేయాలంటూ సూక్తిముక్తావళి చెప్పాడు. మరి ప్రశ్నించలేక ఈ విధంగా చేతులెత్తేసే దానికి ప్రజల్లోకి రావడమెందుకు? ఆ పార్టీలకు ఓట్లేయమని చెప్పడమెందుకు? ఈరోజు ఉన్న పవర్‌ను తగ్గించుకుని ప్రజల్లో పవర్ లెస్ స్టార్‌గా మిగిలిపోవడమెందుకు?

# నెల్లూరులో 10 రైతు బజార్లు

## నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరులో 10 రైతుబజార్లు ఏర్పాటు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ప్రాథమిక రంగంలో రెండంకెల అభివృద్ధి సాధించడంపై వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులతో చర్చించి నెల్లూరు నగరంలో 10 రైతుబజార్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రెండంకెల అభివృద్ధి సాధించాలంటే ప్రస్తుతం సాగుచేస్తున్న భూముల్లో అధిక దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటల సాగు, కూరగాయల సాగు, సెరికల్చర్, చెరుకుపంటల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, ఇరిగేషన్, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాజుకు కృష్ణా పుష్కర పురస్కారం



రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో కృష్ణా పుష్కర కవి తోత్సవంలో భాగంగా మంగళవారం విజయవాడ లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో కృష్ణా పుష్కర పురస్కారం ఘనంగా జరిగింది. నెల్లూరు జిల్లాకు చెందిన యువకవి కె.మురళీమోహన్‌రాజు చేస్తున్న సాహిత్య కృషిని అభినందిస్తూ రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పల్లె రఘు నాథరెడ్డి అతనికి కృష్ణ పుష్కర పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారభాషా సంఘం అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ, విజయవాడ డిప్యూటీకలెక్టర్ సూర్యకళ తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతను అభినందించారు.

### అహింసాయుత పోరాటమే
# ఉద్యమాలకు స్ఫూర్తి

దక్షిణాఫ్రికాలో అహింసాయుత మార్గంలో గాంధీ చేసిన పోరాటం మన దేశంలో మరెన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు స్ఫూర్తినిచ్చిందని తెలుగు బాషో ద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి అన్నారు. నెల్లూరుజిల్లా ఇందుకూరు పేట మండలం పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం జరిగిన గాంధీ అధ్యయన తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. 'స్వాతంత్రోద్యమంలో గాంధీ పాత్ర' అన్న అంశంపై మాట్లాడుతూ ఉద్యమాల్లో గాంధీ ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలను ఆశించలేదన్నారు. తొలుత ఆశ్రమ ఆవరణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌ముని, సిద్దారెడ్డి, ఆశ్రమ కమిటి కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, సభ్యులు నారాయణ, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

# నేతాజీ విద్యార్థులకు అభినందనలు




శ్రీకృష్ణ సేవాసమితి వారు నిర్వహించిన సోదరి నివేదిత 150వ జయంతి వేడుకల్లో భాగంగా జరిపిన పోటీ పరీక్షల్లో శ్రీ నేతాజీ (యంఎస్ఆర్) ఫైలెట్ అంధ విద్యార్థి పి.సౌమ్య(8వ తరగతి) ప్రథమ బహుమతి, పి.రమ్యచరిత(8వ తరగతి) కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 20న విద్యార్థులకు జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రూ.3వేలు నగదు బహుమతితో పాటు నెల్లూరు నగరంలో ప్రథమంగా నిలిచిన పి.సౌమ్య విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యకు కొలమానంగా జరిగే ప్రతి పోటీపరీక్షకు అన్ని తరగతుల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, హెడ్‌మాస్టర్ జి.నరశింహారావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జయంతులు, వర్ధంతులతో
# సరిపుచ్చుకోవద్దు

టంగుటూరు ప్రకాశం పంతులు నిస్వార్థ ప్రజానాయకుడు, సమర్ధ ప్రజా పరిపాలకుడు. ఆయన జయంతి, వర్ధంతులతో సరిపుచ్చుకోకుండా ప్రభుత్వ విద్యాశాఖ ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చేర్చి యువతకు స్ఫూర్తిని కలుగజేయాలని బ్రాహ్మణ మహాసభ గౌరవాధ్యక్షులు, విశ్రాంత తహశీల్దార్ రాళ్ళపల్లి రామసుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు.

# వైకాపాకు బలమా?

(5వ పేజీ తరువాయి)

ప్రజల మధ్య తిరుగుతున్నారు. ప్రజల్లో వారి పట్ల పెద్ద వ్యతిరేకత కూడా ఏమీ లేదు. కాకపోతే పార్టీని ఇంకా ముందుకు తీసుకెళ్లడం, ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా దాడి చేయడం మొదలుపెట్టాలి. తెలుగుదేశం ఎమ్మెల్యేలున్న చోట వస్తున్న వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మలచుకోవాలి. ముఖ్యంగా వైకాపా నాయకులు దృష్టిపెట్టాల్సింది తెలుగుదేశం పార్టీలోని అసంతృప్తి వాదుల మీద! పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు పదేళ్లపాటు పార్టీ కోసం చొక్కాలు చించుకుని పనిచేసిన వాళ్లు, ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చినా ఏ పదవులు లేక చెక్కభజన చేసుకుంటున్నారు. కాంగ్రెస్, వైకాపాల నుండి వచ్చిన వాళ్లు పదవులను ఎగరేసుకు పోతుంటే బిక్కవచ్చిన వాళ్లలా చూస్తున్నారు. ఇలాంటి అసంతృప్తి వాదులను వైకాపాలోకి లాక్కోవాలి. ప్రతి నియోజకవర్గంలోనూ ఇలాంటి వారి సంఖ్య గణనీయంగావుంది. స్థానిక వైకాపా నాయకులు 'దేశం'లోని అసంతృప్తి, అసమ్మతి వాదులపై దృష్టి సారించాలి. 'దేశం'లోని బలహీనతలనే తన బలంగా మార్చుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుడితే ఫలితముంటుంది.

# మన స్వాతంత్ర్యవీరులు

(గత వారం తరువాయి)

***ఉద్యమాల పురిటిగడ్డ, పోరాటాల పుట్టినిల్లు మన నెల్లూరు. మొలగొలుకులు మొలచిన జిల్లాగా, మొనగాళ్లకు ఖిల్లాగా ప్రసిద్ధి మన నెల్లూరుజిల్లా. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటీష్ ముష్కరులపై తిరుగుబాటు చేసి జైళ్ళపాలైన ఎందరో పోరాటవీరులు మన జిల్లాలో వున్నారు. ఆనాటి సమరంలో పాల్గొన్న ధీరోదాత్తుల వివరాలను పొందుపరుస్తూ గతంలో "హూస్ హూ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అన్న పేర రాష్ట్రంలో స్వాతంత్ర సమరోద్యమంలో పాల్గొన్న వేలాది మందికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ సమగ్ర గ్రంథాన్ని మూడు సంపుటాలుగా ముద్రించింది. వాటిలో మూడవ సంపుటిలో నెల్లూరుజిల్లాకి సంబంధించిన దాదాపు 400మందికి పైగా సమరవీరుల ప్రాథమిక సమాచారాన్ని 'లాయర్' సేకరించగలిగింది. గత వారం నుండి వారి పేరు, ఊరు వివరాలను 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.***

**గమనిక :** ఈ మహనీయులకు సంబంధించిన వారి కుటుంబసభ్యులు కాని, లేదా వారి వారసులు గాని... తమ వద్ద క్రింది వారికి సంబంధించిన సమాచారం కాని, వారి ఫోటోలు గాని వుంటే మాకు పంపగలరని మనవి. వీరందరికి సంబంధించిన సమాచారాన్ని సాధ్యమైన వరకు సేకరించి పాఠకులకు, రేపటి తరానికి అందించాలని సాహసిస్తోంది 'లాయర్'. ఆదరించండి, ఆశీర్వదించండి. మీకు తెలిసిన వివరాలను వెంటనే మాకు నేరుగా గాని, లేక ఇ-మెయిల్ roopagroup@yahoo.com ద్వారా గాని పంపవలసినదిగా విజ్ఞప్తి.

మన జిల్లాలోని స్వాతంత్ర్యసమరయోధుల పేరు, ఇంటిపేరు, వూరు, వారి స్వస్థలాలను సూచిస్తూ అప్పటి పాత తాలూకాల్లోని ఆయా పూర్వపేర్లతో అకారాది క్రమం(ఆల్ఫాబెటికల్ ఆర్డర్)లో రూపొందించిన జాబితా ఇది. గమనించగలరు.

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 110 | లక్షమ్మ గడ్డం | నెల్లూరు |
| 111 | లక్ష్మణసింగ్ | వెంకటగిరి |
| 112 | లక్ష్మయ్య టివి | వెంకటగిరి |
| 113 | లక్ష్మయ్య ఊటుకూరు | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 114 | లక్ష్మయ్య వేమూరు | అల్లూరు కోవూరు తాలూకా |
| 115 | లక్ష్మీకాంతమ్మ బెజవాడ | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 116 | లక్ష్మీకాంతయ్య గోపాలుని | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 117 | లక్ష్మీకాంతయ్య శ్రీగిరిరాజు | కృష్ణపట్నం నెల్లూరు తాలూకా |
| 118 | లక్ష్మీనరసారెడ్డి ఇసనాక | యల్లాయపాలెం కోవూరు తాలూకా |
| 119 | లక్ష్మీనరసారెడ్డి పూండ్ల | యల్లాయపాలెం కోవూరు తాలూకా |
| 120 | లక్ష్మీనరసింహం ఆకెళ్ళ | గూడూరు |
| 121 | లక్ష్మీనరసింహం ఆర్కాటు | వెంకటగిరి |
| 122 | లక్ష్మీనరసింహం చింతలపల్లి | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 123 | లక్ష్మీనరసింహారావు చేజర్ల | చినమాచనూరు ఉదయగిరి తాలూకా |
| 124 | లక్ష్మీనారాయణ భట్టారం | నెల్లూరు |
| 125 | లక్ష్మీనారాయణ గట్టుపల్లి | నెల్లూరు |
| 126 | లక్ష్మీనారాయణరావు కనుపర్తి | వెంకటగిరి |
| 127 | లక్ష్మీరెడ్డి నూకలపాటి | అల్లూరు కోవూరు తాలూకా |
| 128 | లచ్చారెడ్డి కాటంరెడ్డి | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 129 | మహదేవయ్య కన్నాడి | సూళ్ళూరుపేట |
| 130 | మహలక్ష్మమ్మ ఓరుగంటి | కావలి |
| 131 | మైత్రేయి | నెల్లూరు |
| 132 | మల్లయ్య నాపా | సూళ్ళూరుపేట |
| 133 | మంగళాంబ కూరపాటి | నెల్లూరు |
| 134 | మంగయ్య | బంగారుపేట వెంకటగిరి తాలూకా |
| 135 | మంగిలాల్ జె | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 136 | మన్నార్‌కృష్ణయ్య మిడుతూరు | పల్లిపాడు నెల్లూరు తాలూకా |
| 137 | మరియన్న దామవరపు | నెల్లూరుజిల్లా |
| 138 | మస్తాన్ చేబ్రోలు | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 139 | మహమ్మద్ అక్బర్‌సాహెబ్ | అల్లూరు కోవూరు తాలూకా |
| 140 | మహమ్మద్ గౌస్‌సాహెబ్ | నెల్లూరుజిల్లా |
| 141 | మహమ్మద్ ఖాజామొహిద్దీన్ | నెల్లూరు |
| 142 | మునుస్వామిరెడ్డి వేనాటి | చేనిగుంట సూళ్ళూరుపేట |
| 143 | ముత్తయ్యనాయుడు గంగినేని | కావలి |
| 144 | నాదముని వేమూరు | కావలి |
| 145 | నాగనారాయుడు నారు | నెల్లూరు |
| 146 | నాగపనాయుడు తొండపు | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 147 | నాగేశ్వరరావు పసిరాజు | కావలి తాలూకా |
| 148 | నాగిరెడ్డి రామలింగం | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 149 | నరసప్పనాయుడు గంగినేని | కావలి |
| 150 | నరసారెడ్డి అమ్మిరెడ్డి | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 151 | నరసారెడ్డి కూనం | చోడవరం కావలి తాలూకా |
| 152 | నరసారెడ్డి వరికూటి | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 153 | నరసయ్య విశ్వనాథం | కోవూరు |
| 154 | నరసింహం ఎస్ | నెల్లూరు |
| 155 | నరసింహం సగుటూరు | నెల్లూరు |
| 156 | నరసింహరాజు పూసపాటి | అలగానిపాడు కోవూరు తాలూకా |
| 157 | నరసింహరావు బెల్లంకొండ | కావలి తాలూకా |
| 158 | నారాయణరావు త్వరకవి | నెల్లూరు |
| 159 | నారాయణయ్య అద్దాల | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 160 | నిత్యానందం ఊరుబిండి | నెల్లూరు |
| 161 | ఓబమ్మ పల్లా | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 162 | ఓబయ్యచెట్టి కోట | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 163 | ఓబులుశెట్టి జొన్నలగడ్డ | బుచ్చిరెడ్డిపాలెం కోవూరు తాలూకా |
| 164 | పద్మనాభయ్య చేజర్ల | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 165 | పద్మనాభయ్య చింతలపల్లి | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 166 | పద్మనాభయ్య గాదేపల్లి | గండవరం కోవూరు తాలూకా |
| 167 | పద్మనాభయ్య సోమపూడి | నెల్లూరు |
| 168 | పద్మారెడ్డి బెజవాడ | అల్లూరు కోవూరు తాలూకా |
| 169 | పకీర్ నలబోలు | గూడూరు |
| 170 | పకీరయ్య చేని | నాయుడుపేట సూళ్ళూరుపేట తాలూకా |
| 171 | పాలిశెట్టి దోడిపర్తి | సూళ్ళూరుపేట |
| 172 | పరదేశయ్య పల్లా | గండవరం కోవూరు తాలూకా |
| 173 | పరశురాం పాటూరు | నెల్లూరు |
| 174 | పార్థసారథి అయ్యంగార్ కొమందూరు | నెల్లూరు |
| 175 | పట్టభిరామిరెడ్డి మేదా | యల్లాయపాలెం కోవూరు తాలూకా |
| 176 | పట్టాభిరామిరెడ్డి నాయుడు | రేబాల కోవూరు తాలూకా |
| 177 | పెంచలనరసారెడ్డి బోయల | వెరుబోట్లపల్లి రాపూరు తాలూకా |
| 178 | పెంచలరెడ్డి ఇందూరు | సూరాయపాలెం |
| 179 | పెంచలరెడ్డి ఇందూరు | మర్రిపాడు కోవూరు తాలూకా |
| 180 | పెంచలరెడ్డి మన్నం | మర్రిపాడు కోవూరు తాలూకా |

(మరిన్ని పేర్లు వచ్చే వారం)

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2016 నాటికి 26 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **కీ॥శే॥ గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు - కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్టారెడ్డి - ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ**

కుమార్తెలు - అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com